ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **సద్గురు శ్రీ నాన్నగారు**

సంపుటి : 11 సంచిక : 11 జూలై 2006

# జ్ఞానము గురుముఖతా నేర్వాలి

సముద్రం నిండా జలముంది కదా అని ఆ నీటిని త్రాగితే దప్పిక తీరదు. అదే సముద్రజలము ఆవిరిగా మారి మేఘముల ద్వారా వర్షించి, నదులలో చేరిన నాడు ఆ తీయని జలపానము చేస్తే దప్పిక తీరుతుంది. శాంతి కలుగుతుంది. అదే విధంగా ప్రస్థాన త్రయముల వంటి గొప్ప శాస్త్రములు మనకున్నాయి కదా అని మనంతట మనం వీటిని సొంతంగా అధ్యయనం చేయటం వలన మన సంశయాలు తీరవు సరికదా మరింత అయోమయంలో పడవేస్తాయి. వేదాంతశాస్త్రములలోని జ్ఞానాన్ని వినయంతో గురువులను సేవించి, వారి ద్వారా శ్రవణం చేయాలి. గ్రంథాలలోని వేదాంత రహస్యాలు, ధర్మ సూక్ష్మాలు గురుముఖమునుండి, మహాత్ముల వాక్కు ద్వారా వెలువడినప్పుడు శ్రవణం చేసిన వారికి తప్పక ఆత్మజ్ఞానము కలుగుతుంది. భగవంతుడు కూడా జ్ఞానాన్ని తాను నేరుగా ఇస్తానని ఎక్కడా చెప్పలేదు. సద్గురువులను ఆశ్రయించి జ్ఞానాన్ని పొందమని చెప్పాడు. జ్ఞానులైన మహాత్ములు తాముండే అత్యున్నతస్థాయి నుంచి మనముండే అట్టడుగు స్థాయికి దిగివచ్చి, ఎంతో ప్రేమతో మనలను ఒక్కొక్క మెట్టు జాగ్రత్తగా ఎక్కించి తానుండే పైస్థాయికి తీసుకువెళతారు. అది జ్ఞానుల, సద్గురువుల వైభవము. జిజ్ఞాస కలిగిన భక్తులందరూ ఆ జ్ఞానాన్ని పొందటానికి అధికారులే కనుక సద్గురువులను ఆశ్రయించి వేదాంత జ్ఞానాన్ని పొందాలి.

– బొప్పన అరుణాదేవి, హైదరాబాద్

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 36
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాలకోడేరు ....... 06-04-06
విజయవాడ ....... 28-04-06
భీమవరం .......... 12-05-06
పాలకొల్లు .......... 11-06-06
జిన్నూరు ............ 28-06-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

# గురు అనుబంధాన్ని పదిలపరుచుకోవటమే గొప్ప సాధన

ఆధ్యాత్మిక మార్గంలో గురువును మనంతట మనం గుర్తించటం అసంభవము. బహు జన్మల కృషి ఫలితంగా "ఆర్తి" గల జీవుణ్ణి ఈశ్వరుడు సద్గురువు సన్నిధికి చేరుస్తాడు. గురు బాధ్యత ముళ్ళకిరీటాన్ని ధరించటంలాంటిది. దండలు, దండాలు, పళ్ళు స్వీకరించటం కాదు అది సాంప్రదాయకమైన బంధమని మన్నిస్తారు. శిష్యుని భవిష్యత్తు ఆపదను కనిపెట్టి కాపాడాలి. మన మనో వికారాలను ఓర్చుకొంటూ మూడు నెలల పసిపాపపై తల్లికి ఉండే రక్షణ బాధ్యతలా ప్రేమగా నిరంతరం పర్యవేక్షించాలి. గురువు వద్దకు వచ్చినవారు మొదట అంతా వారు చెప్పినది విని వారి నుండి శ్రేయస్సును పొందాలని వస్తారు, కాని వారిలో కొందరు కొంతకాలానికి వారిలో అణిగిఉన్న పాప పంకిలమైన వాసనలు వారి అనుబంధాన్ని పరీక్షలు పెట్టటం ప్రారంభిస్తాయి. కష్టాలు పెరుగుతాయి. గురువు అంటే గుణాతీతుడు, రూపాతీతుడు వెలిగా కనిపించేది మనలను సరిదిద్దటానికే, ఆయన పరమాత్మ అనే స్ఫురణ పోతుంది. మనిషిలాగే కనిపిస్తాడు వారితో అలాగే ప్రవర్తిస్తారు. గురువు అంతరంగంలో పొంగిపొరలుతున్న ప్రేమభావాన్ని ఉన్నది ఉన్నట్లుగా ప్రదర్శిస్తే నెత్తికెక్కుతారు పోనీ దాన్ని చూపకపోతే ఎదురుగా ఉన్న అమృతభాండాన్ని చూస్తూ, చూస్తూ కాలదన్నుకొంటారు. కొందరి భక్తుల స్థాయి పాతాళ లోకానికి చేరి ఉంటుంది. గురువు వారి స్థాయికి దిగి వచ్చి వారి కర్మల భారాన్ని వహించటమంటే ఎంతో దయ, ప్రేమ కావాలి. "కొందరు నమస్కారం పెడితే లెంపకాయ కొట్టినట్లు ఉంటుంది" అంటారు. అవి చెల్లని నాణాలు, నొక్కుకుపోయినవి, విరిగిపోయినవి, అరిగిపోయినవి, తిరిగి పోతపోసుకోవలసిందే. అంటే దైవీ సంపదతో కరిగించి, అనుగ్రహంతో పుటం వేసి మూసలో పోయాలి.

ఈ ప్రక్రియలో గురువు వారిని చేరదీస్తే చివరకు వారు చెప్పిందల్లా ఆడమంటారు అంటే మా భవనాలకు వచ్చి మా శుభకార్యాలకు రావాలి అంటారు. అలా రాకపోతే గుసగుసలు ప్రారంభిస్తారు. గురువుగారు మారిపోయారు అంటారు. అసంతృప్తితో దౌర్భాగ్యపు జీవితంవైపు మొగ్గ చూపుతారు, బెదిరింపులతో ఆడించాలని చూస్తారు. ముందు సేవచేస్తామంటారు. అంగీకరిస్తే తాము ఎంతో అధికులమైనట్లు అహంకరిస్తారు. క్రమంగా వారి పట్ల తేలిక భావాన్ని వహిస్తారు. తమ మీద ఆధారపడినట్లు భావిస్తారు. కాదని తెలిసేలా చేస్తే ఇంత సేవ చేయించుకొని అవసరం తీరిన తరువాత వదిలినట్లు బాధపడతారు. సాధకుని దుష్ట సంకల్పాన్ని నివారించటానికి కోపాన్ని నటించి, ఉపేక్షభావంతో ఉంటే కినుక

వహించి, వీరి కంటే గతించిన అవతార పురుషులను ఆరాధిస్తే ఏ కోపాలు, తిరస్కారాలు ఉండవు. హాయిగా ఉండవచ్చు అనుకొంటూ వారి నుండి తొలగి పోవటానికి ప్రయత్నిస్తారు. సజీవ సద్గురువు యొక్క వైభవం బుద్ధికి అందదు. వాళ్ళు ప్రతీ చర్యను మాటను వాళ్ళ ఇష్టా యిష్టాల త్రాసులో తూచి గురువు మీద తీర్పులు చెబుతారు. వారి ఆంతర్యంలో మార్పు రావటం లేదని గురువుగారు వారిని దూరంగా ఉంచితే అపార్థం చేసుకొని వాపోతారు. కినుక వహించి చులకన భావం పెంచుకొంటారు. జన్మకు వచ్చిన పని మర్చిపోతారు. అటువంటి మనుషులతో మసలటం కంటే అరణ్యంలో ఉండటం మేలు అనుకొనేలా చేస్తారు. గురువు ఎవరినైనా ఎక్కువ బాధల్లో ఉండి భరించలేని స్థితిలో ఉంటే వారిని ప్రత్యేక ప్రాధాన్యతతో పలకరిస్తే విషయాన్ని గ్రహించలేక, సరిపెట్టుకోలేక, తన్ను సరిగా గుర్తించలేదని వాపోతారు. ఇది చంటి పిల్లల మనస్సులా తయారు కావటం, దాన్ని భరించటం, మాతృ ప్రేమ కల్గిన గురువుకే సాధ్యం. ఎవరైనా భక్తితో గురువుగార్కి ధనం ఇస్తే దాన్ని ఆయన సత్‌కార్యానికి వినియోగిస్తే, గురువుగారికి ఇంత ధనం ఇచ్చానని స్మరించుకొంటూ వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంది వారి అహంకారం, కాని అది ఎంత మేలు చేసింది అని భావించరు. జన్మ పరంపరలను దాటించటానికి రాత్రి పగలు శ్రమపడి శాంతి సామ్రాజ్యానికి అధిపతిని చేసే గురువుకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం ఇవి అన్నీ "శ్రద్ధ" లోపించటం వల్ల వచ్చే చెడు ఫలితాలు. సాధకులు దీన్ని గుర్తించాలి.

గురు అనుబంధం తెగితే తప్పిపోయిన రైలు ప్రయాణీకుని గతిలా తయారు అవుతుంది. ప్రేమ గురువును కలలో కూడా శంకించకూడదు. "గురు రూపాన్ని వారి కళ్యాణ గుణాలను స్మరించటానికి మించిన సాధన లేదు. ఉన్నాయి అనుకొంటే అవి అన్నీ కోతి చేష్టలు" అంటారు పెద్దలు. శ్రీనాన్నగారు అంటారు "గురువు ఆగ్రహం కూడా అనుగ్రహమే అని గుర్తించిన వారు ధన్యులు, గురు ప్రేమలో ఊగిసలాడే వారి అహంకారపు మలాలు వాటంతట అవి రాలిపోతాయి. గురువు ప్రతీ చర్య అనుగ్రహమే" అన్నారు. మనం సక్రమంగా ఉంటే గురువు శిక్షించటానికి పిచ్చివాడా! కాబట్టి గురు అనుబంధాన్ని ప్రాణప్రదంగా భావించి, భద్రపరచుకొని భవిష్యత్తు జీవితాన్ని బంగారు బాటగా మలచుకొని సుఖించాలి, గురువుకు మించిన దైవం ఇలలో లేదు నమ్మి ఆచరిస్తే మనలను ఇలవేల్పులుగా, తరగని నిధులుగా మార్చుతారు గురువు. రాద్ధాంతాలకు పోక ఈ సిద్ధాంతాన్ని గుర్తించి గురి కలిగి ఉంటే గమ్యాన్ని చేరినట్లే.

– సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-04-06, పాలకోడేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి, మనం తరించటానికి ఒక్క రామనామం చాలు. మనకు ఇంద్రియాలు ఉన్నాయి. ఆ ఇంద్రియాలను ఎంతవరకు ఉపయోగించు కోవాలో అంతవరకే ఉపయోగించుకోవాలి, అతిగా వాటిని ఉపయోగించకూడదు. రాముడు గుణవంతుడు, శక్తివంతుడు, ఆత్మ తెలిసినవాడు, ప్రియదర్శిని అంటే మనకు చూచేకొలది చూడాలనిపిస్తుంది అంటే ఎంతసేపు చూసినా ప్రియంగా కనిపిస్తాడు. రాముడిని చూసి మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే అంత కృతజ్ఞత ఉన్న మనిషి కనిపించడు. రాముడు ధర్మావాన్ అంటే ధర్మమే రూపంగా కలవాడు, సత్యవాన్ అంటే దోషం ఎలా ఉంటుందో తెలియనివాడు, సత్యం మాట్లాడతాడు అది కూడా మితంగా, హితవుగా, అర్థమయ్యేలాగ మాట్లాడతాడు. ఎవరితోను అతిగా స్నేహాలు పెట్టుకోడు అలాగని ఎవరితోను విరోధం పెట్టుకోడు. మీరు సుఖంగా, ఆరోగ్యంగా జీవించాలంటే వివేకం, వైరాగ్యం పెరగాలంటే తిండి దగ్గర సమానంగా ఉండాలి, అతిగా తినకూడదు. నోరు ఉందని ఎక్కువ మాట్లాడ కూడదు. ఇంద్రియాలను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి, అతిగా ఉపయోగిస్తే కంట్రోలు తప్పిపోతుంది. ఎక్కడ యోగీశ్వరుడైన కృష్ణుడు ఉన్నాడో, ఎక్కడ ధనుర్ధారి అయిన అర్జునుడు ఉన్నాడో అక్కడ లక్ష్మి ఉంటుంది, విజయం ఉంటుంది, మీకు సుఖం తెలుస్తుంది. కృష్ణుడు అంటే కృప, అర్జునుడు అంటే కృషి. రాముడిలో కృప ఉంది, కృషి ఉంది అంటే కృష్ణుడు ఉన్నాడు, అర్జునుడు ఉన్నాడు. అంటే కృష్ణుడు, అర్జునుడు చేసేపని రాముడు ఒక్కడే చేసేస్తాడు, వాడు రామచంద్రమూర్తి. దేవుడు మానవరూపంలో ఉంటే ఎలాఉంటాడు అంటే రాముడిని చూడాలి, మనిషి దేవుడి కింద ఉంటే ఎలాఉంటాడు అంటే రాముడిని చూడాలి. తొందరపాటుగా మాట్లాడటం కాని, తొందరపాటుగా పని చేయటం కాని రాముడి స్వభావంలో లేదు. రాముడి స్వభావం మీకు రావాలంటే రాముడు చెప్పిన మాటలు జ్ఞాపకం పెట్టుకొంటూ, రాముడి రూపాన్ని ధ్యానం చేసుకొంటూ, రామనామాన్ని స్మరించుకొంటూ ఉంటే మీ అందరికి రామస్వభావం వచ్చేస్తుంది. రాముడి స్వభావం మీకు వస్తే మీరు మోక్షం దగ్గరకు వెళ్ళనక్కరలేదు, మోక్షమే మీ ఇంటి తలుపులు తడుతుంది, అది రాముడి యొక్క వైభవం.

మీరు చేస్తున్న పనే ఫలితం అన్నాడు రాముడు. మీరు అలా ప్రవర్తిస్తూ ఉంటే

చదువుకునే విద్యార్థులు టైర్ అవ్వరు, వ్యవసాయం చేసే వారికి అశాంతి రాదు, సంతోషం, దుఃఖం ఏమీ ఉండవు, మీకు సమత్వబుద్ధి వచ్చేస్తుంది. మీరు చేస్తున్న పనే ఫలితం అని మీకు అర్థమైతే ఫలితం కోసం ఇక ఎదురుచూడరు, మీకు అశాంతి రాదు. నీ వాటాకు ఎంత ఇవ్వాలో అంతే ఇస్తాను కాని ఎదురుచూడటం వలన ఎక్కువ ఇవ్వను, ఫలితం గురించి మర్చిపోవటం వలన తక్కువ ఇవ్వను అని పరమాత్మ చెప్పాడు. ఈశ్వరసంకల్పం ప్రకారం అంతా నడుస్తోంది కాని నీ కోరిక ప్రకారం నడవదు. ఫలితం ఇస్తాడు, లేకపోతే ఇవ్వడు ఆ గొడవ నీకు ఎందుకు? నీవు పని చేస్తూ ఉంటే నీకు ఇహం ఉంటుంది, పరం ఉంటుంది, ఈ లోకంలో సుఖంగా రోజులు వెళ్ళిపోతాయి, నీకు వైకుంఠం దొరుకుతుంది. రాముడు ఎవరు అంటే ఈ లోకానికి పరలోకానికి వంతెనలాంటివాడు, ఈ సంసార సముద్రం దాటటానికి ఒక బ్రిడ్జిలాంటివాడు. ఎక్కడైతే రాముడు ఉన్నాడో అక్కడ మనస్సు లేదు, ఎక్కడైతే మనస్సు ఉందో అక్కడ రాముడు లేడు. రాముడిని మీ హృదయంలో నిలబెట్టుకోండి, మీ పని పూర్తి అయిపోతుంది. రాముడు చిత్రకూటం వద్ద ఉండగా భరతుడు వచ్చి నీవు కైక మాటలు, దశరథుడు మాటలు పట్టించుకోవద్దు. ఇంటికి రమ్మని రాముడిని అడుగుతాడు. అప్పుడు రాముడు ఒక మాట చెప్తాడు. నేను 14 సంవత్సరాలు అరణ్యవాసం చేయాలి, నువ్వు రాజ్యపాలన చేయాలి, అది ఈశ్వరనిర్ణయం. దశరథుడు ఇలా చెప్పాడు, కైక ఇలా చెప్పింది అవి ఏమీ నిజం కాదు. మనం ఈశ్వరసంకల్పం ప్రకారం యాక్ట్ చేయవలసిందే. మన తల్లి కడుపులో శరీరాలు తయారైనప్పడే ఆ శరీరం ఈ భూమిమీద ఎంతకాలం జీవించాలి, ఎక్కడ ఉండాలి, ఏ పని చేయాలి, స్మశానానికి ఏ రోజు వెళ్ళాలి అన్నీ నిర్ణయించే ఈ శరీరాన్ని భూమి మీదకు పంపిస్తాడు. మనందరం తెగిపోయిన గాలిపటాలలాగ లేము ఎటుపడితే అటు వెళ్ళిపోవటానికి, మనం ఈశ్వరుడి కంట్రోలులో ఉన్నాము కాని అది మనకు తెలియటం లేదు ఎందుచేతనంటే మనం ఈశ్వరుడి కంటే వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. రాముడి మీద మనకు ప్రేమ లేదు, ఇష్టం లేదు. రాముడి మీద మనకు ప్రేమ ఉంటే, ఇష్టం ఉంటే సాధన పేరు మీద బాధ ఏమీ అక్కరలేదు, సహజంగానే రాముడిలో ఐక్యమవుతాము. ఇష్టం లేకపోవటం వలన సాధన పేరు మీద కష్టాలు పడవలసి వస్తోంది.

మనలో ఉన్న కోరికలే దొంగలు. బయట దొంగల కంటే లోపల దొంగలు ఎక్కువ ప్రమాదం. బయట దొంగలు మన దగ్గర ఉన్న బంగారం, డబ్బు పట్టుకొని పోతారుకాని లోపల దొంగలు కొన్ని వేల జన్మలకు కారణం అవుతారు. రాముడిని స్మరించటం వలన, రాముడు చెప్పిన మాటలను శ్రవణం చేసి, మననం చేసి, ఆ ప్రకారం మనం జీవించటం

వలన లోపల దొంగలకు సహజంగానే మరణం వచ్చేస్తుంది. మనం వాటితో పెద్దగా పోరాడవలసిన పని లేదు. రామశాస్త్రి అనే ఒక భక్తుడు భగవాన్ దగ్గరకు వచ్చారు. నన్ను ప్రాణాయామం చేయమంటారా, ఏమి సాధన చేయమంటారు అని భగవాన్‌ను అడిగితే అప్పుడు భగవాన్ అన్నారు నీ పేరే రామశాస్త్రి నీ పేరును విడిచిపెట్టి ఎక్కడికి పారిపోతావు, ఆ రాముడితో ఒకటిగా ఉండటం నేర్చుకో అదే చాలు, ఇంక నీకు వేరే ట్రైనింగులు ఎందుకు అన్నారు భగవాన్. రామానుజుడు వారి మేనమామ దగ్గర 14 సార్లు రామాయణం చెప్పించుకొని శ్రవణం చేసాడు, ఇంక వారికి ప్రత్యేకంగా సాధన ఏమీ అక్కరలేదు. రాముడి యొక్క కళ్యాణగుణాలను జుర్రుకోవటమే. రాముడు అరణ్యవాసానికి వచ్చినప్పుడు మొదటి రాత్రి నేలపై చెయ్యితలకింద పెట్టుకొని పడుకొన్నాడు. ఆ ఘట్టం చెపుతూ ఉంటే పెరుమాళ్ళు నేలమీద పడుకొంటూ పడుకొన్నాడు, అది నేను భరించలేకపోతున్నాను, ఆ ఘట్టం విడిచిపెట్టి చదువు అని మేనమామతో రామానుజుడు చెప్పేవాడు. వాడు రామానుజుడు, అది ఆయన భక్తి యొక్క వైభవం. భక్తి అంటే ఏదో కాలక్షేపం కోసం అనుకొంటున్నారు. అలా కాదు మిమ్మల్ని బాగుచేసేది భక్తి, మీలో వివేకాన్ని వైరాగ్యాన్ని పెంచేది భక్తి. మీ హృదయంలో అంతర్యామిగా ఉన్న రామచంద్రమూర్తితో మిమ్మల్ని అనుసంధానం చేసేది భక్తి.

నేను కర్తను అనే భావన లేకుండా ఉండటమే కర్మయోగం. మీ శరీరాల ద్వారా ఎవరు పని చేస్తున్నారు? ఈశ్వరుడే పనిచేస్తున్నాడు. మనం కర్తలం కాదు. అందుచేత నేను చేస్తున్నాను అనే భావన వదిలెయ్యి వెంటనే దుఃఖం ఆరిపోతుంది. అందరి శరీరాల ద్వారా ఈశ్వరుడే పని చేస్తున్నాడు. నీ దేహం ద్వారా ఏదైనా మంచిపని జరిగినా నీ దేహానికి ఏదో గౌరవం ఇవ్వటంకోసం ఆపని చేయించాడు, శక్తి నీది కాదు, శక్తి ఈశ్వరుడిది, చేసినవాడు ఆయనే. నేను చేసాను, నేను చేసాను అని నువ్వు అనుకొంటున్నావు. అనుకొనేవాడు జీవుడు, అనుకోకుండా సైలెంట్‌గా పని చేసేవాడు దేవుడు. ఎప్పడు ఎక్కడ ఎలా జరగాలో అనుసంధానం చేసుకొంటూ వెళ్ళిపోతాడు వాడు దేవుడు. మనం ఇంటి దగ్గర అన్నం తింటున్నాము. మనం తినే బియ్యం ఏదో చేనులో పండాలి. ఆ చేనులో పండినప్పడే జీవుడి నోటికి ఏ బియ్యం వెళ్ళాలో అది నిర్ణయం అయిపోతుంది. ఇంక మన వల్ల ఏమౌతుంది. ఎన్నో విషయాలు తెలుసుకొందాము, ఎన్నో శాస్త్రాలు చదువుదాము అనుకొంటున్నాము కాని ఈ నేను, నేను అనేవాడు ఎవడు? అనే ప్రశ్న మనకు ఉదయించటం లేదు. నేను నేను అని చెప్పే ఈ నేను ఎవడు? అని విచారణ చేయాలనే బుద్ధి మనకు రావటం లేదు. ప్రపంచంలో జీవకోటి ఎంత ఉందో, అందరికి తలంపులు వస్తాయి, ఆలోచనలు

వస్తాయి, కోరికలు వస్తాయి. ఇవన్నీ ఎక్కడ నుండి అయితే వస్తున్నాయో వాడే దేవుడు. ఒకోసారి మనకు ఇష్టంలేని తలంపులు వస్తాయి. ఏమిటి ఇటువంటి తలంపులు వస్తున్నాయి అనుకొంటాము. నీకు ఇష్టం లేనప్పుడు ఆ తలంపులు ఆగిపోవాలి కదా! ఎందుచేత ఆగనివ్వటం లేదు? ఆరకంగా మీరు దుఃఖపడే యోగం ఉంటే అవే పంపిస్తాడు. ఈలోపు గురువు అనుగ్రహం వలన దేహాభిమానం నశించిపోయింది అనుకో ఏ తలంపు వచ్చినా అక్కడ నీకు దుఃఖం లేదు.

యజ్ఞాలలో, యాగాలలో, కోరికలలో, ఇష్టాలలో ఏముంది? సుఖం అంతా గురువుఅనుగ్రహంలోనే ఉంది. గురువుఅనుగ్రహం వలననే మనస్సు నశిస్తుంది. ఎన్ని శాస్త్రాలు చదివినా దేహము నేను అనే తలంపును విడిచిపెట్టమనే వాటి సారాంశం. సారం తెలుసుకొన్నాక దానిని ఆచరించటానికి ప్రయత్నం చేయండి. దేహము నేను కాకపోయినా దేహమే నేను అని ఎందుకు అనుకొంటున్నాను అని భగవాన్‌ను అడుగుతున్నారు. పూర్వ జన్మలలో మనం మంచి చేసినా, చెడ్డ చేసినా దేహము నేను అనుకొనే చేసాము. అందుచేత మంచికి మంచి, చెడుకు చెడు మనం అనుభవించ వలసిందే. దేహము నేను అనే తలంపు ఉండదు అనుకో పుణ్యఫలితం ఉండదు, పాపఫలితం ఉండదు. పూర్వజన్మలలో ఉన్న పుణ్యకర్మ, పాపకర్మలు నీచేత అనుభవింపచేయటానికి దేహము నీవు కాకపోయినా దేహము నేను అనే తలంపును బలంగా పెట్టి ఆ కట్రాడుకు కట్టి కొడుతున్నాడు ఈశ్వరుడు. విచారణ చేసి దేహము నేను అనే తలంపు నుండి విడుదల పొందావు అనుకో ఇంక ఆయన చేసేది ఏమీ లేదు. ఎవడైతే దుఃఖపడుతున్నాడో వాడు పోయినప్పుడు ఎన్ని దుఃఖాలు వచ్చినా ఏమి చేస్తాయి. దేహము నేను అనే తలంపు ఊడిపోయింది అనుకో ఎన్ని కష్టాలు వచ్చినా ఏమీ అనిపించదు. దేహాభిమానాన్ని నెమ్మదిగా తగ్గించుకొంటూ రండి. రూపభావన, నామభావన తగ్గించుకోండి. నది వెళ్ళి సముద్రంలో ఎలా కలిసిపోతుందో అలాగ రూపభావన, నామభావన లేనివాడు చైతన్యంలో ఐక్యమైపోతాడు. ఇంట్లో చాలా చాకిరీ చేస్తున్నాము, ఎవరూ గుర్తించటంలేదు అంటారు. అలా అనుకొంటూ ఉంటే అజ్ఞానం పెరిగిపోతుంది. అసలు ఏమీ అనుకోవద్దు. అలా అనుకోవటం వలన జీవలక్షణాలు పెరిగిపోతాయి, మాయ చుట్టేస్తుంది. లోపల ఉన్న చైతన్యం అలాగ అనుకోదు, ఇలాగ అనుకోదు. అనుకొంటే జీవుడు, అనుకోకపోతే దేవుడు.

స్వరూపజ్ఞానం ముందు లోకంలో ఉన్న విద్యలు అన్నీ చప్పగా ఉంటాయి. ఆకలి లేకపోతే అన్నం తినలేము, దాహం లేకపోతే నీళ్ళు తాగలేము అలాగే జిజ్ఞాస లేకపోతే జ్ఞానం సంపాదించలేము. మనం అభివృద్ధిలోనికి రావాలి, ఆత్మానుభవం పొందాలి, ఈ జనన

మరణ చక్రం నుండి బయటకు రావాలి అనే జిజ్ఞాస, ఆ తపన లేకపోతే మనం తరించలేము. ఎవరో ఇతరులు చెప్పటం వలన ప్రయత్నం చేయటం వేరు, మనం బాగుపడాలి అనే తపన మనకు లోపల నుండి రావాలి. ఇతరులలో ఉన్న బలహీనతలను చూడటంకాదు, మనలో ఉన్న బలహీనతలు ఏమిటో జాగ్రత్తగా చూసుకొని వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేయాలి. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. భగవంతుడి సంకల్పాన్ని నీ సంకల్పంగా చేసుకో. ఆయనకు ఏది ఇష్టమో అదే నువ్వు ఇష్టంగా పెట్టుకో. నీ ఇష్టాయిష్టాలను ప్రక్కనపెట్టు. నచ్చిన పని అందరూ చేస్తారు. ఆ పని మనకు నచ్చకపోయినా అది మంచి పని అయితే, ఆ పనిని భగవంతుడు చేయమని చెపితే దానిని నచ్చేటట్లుగా చేసుకొని ఆ పని చేస్తే నీవు తరిస్తావు. ఈ శరీరంలో ఉండగానే నీ పుణ్యం, పాపం అంతా కూడా కాలి బూడిద అయిపోతుంది, ఇక్కడే నిర్వాణసుఖాన్ని పొందుతావు.

హృదయంలోనే సుఖం ఉంది, ఆనందం ఉంది. నీ మనస్సును తీసుకొని వెళ్ళి హృదయంలో ముంచు. అది బయటకు వచ్చేస్తుంది అనుకో మరల తీసుకొని వెళ్ళి అక్కడ ముంచు. హృదయంలో ముంచితే అది కరిగిపోతుంది. మనస్సు కరిగిపోతే హృదయంలో ఉన్న సుఖం స్వరూపంగా వ్యక్తమౌతుంది. దేహం మరణించినప్పడు దేహము నేను అనుకొనేవాడు చావడు. వాడు మరణిస్తే మిగిలేది ఆనందం, మిగిలేది సుఖం. గురువు అనుగ్రహం వలననే దేహము నేను అనే తలంపు పోతుంది. మీరు కష్టపడి కష్టపడి ఎన్ని సాధనలు చేస్తున్నా మనస్సు అణగదు. కాని గురువు అనుగ్రహం ఒక్కసారి మీ హృదయంలోనికి ప్రవేశించింది అనుకోండి మనస్సును కాల్చి బూడిద చేసేస్తుంది. ఎవరినైతే గురువు అనుగ్రహిస్తున్నాడో అది వారికి తెలియాలి అని ఆయన అనుకోడు, గురువుకు గుర్తింపులు అక్కరలేదు. మీ లోపల ఉన్న చీకటిని పోగొట్టేవాడే గురువు. గురువు అనుగ్రహం మీకు వచ్చినప్పడు హృదయంలో ఉన్న సుఖసముద్రం పొంగుతుంది, ఇంతకుముందు ఏవైనా కష్టాలు పడి ఉన్నారు అనుకోండి అప్పడు ఏమి అనిపిస్తుంది అంటే మనకు తెలియక కష్టపడిపోయాము అందులో ఏమీ లేదు అని అప్పడు అనిపిస్తుంది. అట్టిది గురువు అనుగ్రహం. మీ తల్లితండ్రులు ధనవంతులైతే ఇల్లు, కారు, వస్తువులు కొనిపెడతారు, అంతకంటే వారికి చేతకాదు. జ్ఞానాన్ని, శాంతిని ప్రసాదించేవాడు గురువు మాత్రమే. మీకు సాధన చేయాలనే తలంపు ఇచ్చేవాడు, మీచేత సాధన చేయించేవాడు, మిమ్మల్ని శాంతి సామ్రాజ్యానికి అధిపతిని చేసేవాడు గురువు, ఇంతచేస్తున్నా అది మీకు తెలియాలి అని ఆయన అనుకోడు, వాడు గురువు. మాకు చాలా కష్టాలు ఉన్నాయి, ఇది అంతా గురువు ఎలా తీయగలడు

అని మీరు అనుకోవచ్చు. గురువు యొక్క అనుగ్రహప్రవాహంలో మీకు ఎన్ని కష్టాలు ఉన్నా కొట్టుకొని పోవలసిందే, గురువు అనుగ్రహం గెంటలేని వస్తువు ఈ సృష్టిలో లేదు, అట్టిది గురువు అనుగ్రహం. రాముడు ఎంత వైరాగ్యవంతుడు అంటే వైరాగ్యమే ఆ రూపంలో వచ్చింది. 14 సంవత్సరాలు అరణ్యవాసం అయిపోయిన తరువాత రాముడు నంది గ్రామం వచ్చాడు. అప్పడు ఆంజనేయస్వామితో నీవు వెళ్ళి రాముడు నంది గ్రామంలో ఉన్నాడని భరతునితో చెప్ప, ఆ మాటలు చెప్పినప్పడు భరతుడి మొఖం ఎలా ఉందో చూడు, ఆయన మొఖంలో ఆనందం కనబడితే మనం ఆయోధ్యకు వెళదాము, ఆయన మొఖంలో వికారం వస్తే మనం ఇంక అయోధ్యకు వెళ్ళవద్దు అన్నాడు, వాడు రాముడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-04-06, విజయవాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేవుడు, దేవుడు అంటే కళ్యాణగుణాలు కలవాడిని, దివ్యగుణాలు కలవాడిని దేవుడు అంటారు. మీకు అందరికీ ఆత్మజ్ఞానం కలుగుతుంది. సందేహం పెట్టుకోవద్దు. మీకు సందేహాలు పెరుగుతూ ఉంటే ఈశ్వరుడి మీద విశ్వాసం తగ్గిపోతోందని అర్థం. భగవంతుడి మీద విశ్వాసం తగ్గిపోయినప్పడు, శ్రద్ధ తగ్గిపోయినప్పడు సందేహాలు పెరుగుతాయి. మీకు శరీరం తెలుస్తోంది, మనస్సు తెలుస్తోంది. లోపల ఏదో వస్తువు ఉందని దర్శించిన వారు చెపుతున్నారు. నిజంగా అక్కడఉంది కాబట్టి మహర్షులకు గోచరించింది, ఏదో ఉంది కాబట్టి వారు దర్శించారు, లేనిదానిని ఎవడు దర్శనం చేస్తాడు. మనకు మనస్సు ఉంది. మనస్సు కూడా ఆత్మే. మనస్సు ఆత్మ ఎలా అవుతుంది అని మీరు అనుకోవచ్చు. మనస్సు ఇంద్రియాల ద్వారా బాహ్యముఖానికి వెళ్ళినప్పడు జీవుడు అవుతుంది, మనస్సుకు అంతర్దృష్టి కలిగి అది హృదయంలోనికి వెళ్ళి అక్కడ ఉండగలిగితే అది ఆత్మలో లీనమవుతుంది అంటే ఆత్మ అవుతుంది అప్పడు నీకు సుఖం, శాంతి అందుతాయి. అందుచేత మన మనస్సును ఉద్ధరించుకోవాలి. ఎవరోవచ్చి ఉద్ధరిస్తారని ఎదురుచూడవద్దు. మన మనస్సులో ఏ దోషం ఉందో మనకు తెలుస్తూ ఉంటుంది. మనం ప్రయత్నంచేసి ఆ దోషాలను తొలగించుకొంటే మనకు బ్రహ్మానుభవం కలుగుతుంది. మనస్సులో ఉన్న దోషాలను తొలగించుకోకపోతే అది ఇంద్రియాల ద్వారా లోకంలోనికి పోయి అక్కడ ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకొంటుంది. అందుచేత మనస్సులో ఉన్న దోషాలనుండి విడుదలపొందటమే మన జీవిత గమ్యం. ఆ దోషాలనుండి విడుదలపొందిన వెంటనే లోపలఉన్న వస్తువు ఉన్నదిఉన్నట్లుగా మనకు గోచరిస్తుంది. మనస్సును వాసనారహితం చేస్తే ఆ మనస్సే ఆత్మాకారం చెందుతుంది. ఎక్కడో

ఏదో ఉంది, ఎక్కడో ఏదో ఉంది అని మనకు అనిపిస్తూ ఉంటుంది. మనం పొందవలసింది మన హృదయంలోనే ఉంది. బయట ఎక్కడా ఏమీ లేదు. మన వాసనల యొక్క వేగం వలన మనకు అలా అనిపిస్తుంది. ఇదే భగవాన్‌ను ఒకరు అడిగారు. లోపల ఈశ్వరుడు ఉన్నాడని చెపుతున్నారు కదా మరి ఉంటే నాకు ఎందుకు కనిపించటం లేదు అని అడిగారు. నీ వాసనల యొక్క వేగంలో నుండి, నీ అలవాట్ల యొక్క వేగంలోనుండి విడుదలపొందు అప్పుడు లోపల ఉన్నాడో లేడో నీకు తెలుస్తుంది అని భగవాన్ చెప్పారు.

ఏ శాస్త్రం చదివినా మనస్సును నియమించుకోమని చెపుతారు. మీరు భక్తిని అలవాటు చేసుకోండి, మనోనిగ్రహాన్ని పెంచుకోండి. మీకు బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉన్నా క్రమశిక్షణ విడిచిపెట్టవద్దు. క్రమశిక్షణే మనలను జీవితంలో అభివృద్ధిలోనికి తీసుకొని వస్తుంది. ఈశ్వరానుగ్రహం ఉన్నవాడికి జ్ఞానం వచ్చి తీరుతుంది. భూమి యొక్క ఆకర్షణశక్తి వలన వస్తువు ఎలా కింద పడుతుందో అలాగ లోపల ఉన్న ఈశ్వరుడి యొక్క అనుగ్రహానికి పాత్రుడైతే బాహ్యంగా విజృంభిస్తున్న మన మనస్సు లోపలకు వెళ్ళి దాని గూటిలో పడిపోతుంది. పక్షి గూటిలో నుండి బయటకు వచ్చి ఎక్కడో ఆకాశంలో తిరుగుతూ ఉంటుంది. ఎంతపైకి ఎగిరినా, ఎక్కడికి వెళ్ళినా తిరిగి తన గూటికి చేరుకోవాలి. అలాగే మనం ఎన్ని శరీరాలు ధరించినా, ఎక్కడికి వెళ్ళినా మన హృదయం అనే గూటికి చేరుకొనే వరకూ మనకు శాంతిలేదు, సుఖంలేదు. హృదయమే మన నిజమైన ఇల్లు. హృదయమనే గుహకు వెళితే ఈ శరీరం అనే గుహలోనికి తిరిగి రానక్కరలేదు. సూర్యుడు ఉదయించే వరకు చీకటిపోదు. నీరు పోసే వరకు మంట ఆరదు. అలాగే మనకు జ్ఞానోదయం కలిగే వరకూ అజ్ఞానం అనే మహా అంధకారంలో జన్మిస్తూ, మరణిస్తూ ఉండవలసిందే. జీవుడికి అసాధ్యం ఉంది కాని ఈశ్వరుడికి అసాధ్యం ఏమీలేదు. ఈశ్వరుడి యొక్క దయకు పాత్రుడైతే ఆక్షణంలోనే మనలను ఆత్మసింహాసనం మీద కూర్చోబెడతాడు.

నువ్వు వ్యక్తిభావనను తగ్గించుకో, భక్తిభావనను పెంచుకో. భక్తి పెరుగుతూ ఉంటే ప్రాపంచిక వాసనలు వాటంతట అవే తగ్గిపోతాయి. లోకానికి సంబంధించిన మనుషులతోటి సహవాసాలు తగ్గించుకోవాలి. లోకవాసన ఎక్కువగా ఉన్న వారితో సహవాసం వలన హృదయగ్రంధి గట్టిపడిపోతుంది. బాహ్యవిషయాల మీద ఆసక్తి ఎక్కువగా ఉంటే హృదయగ్రంధి బలపడిపోతుంది, దానిని ఛేధించేవరకు మనకు పునర్జన్మలు తప్పవు. పులిని చూసి మేకలు ఎలా పారిపోతాయో అలాగే నీవు భక్తిని పెంచుకొంటూ ఉంటే జన్మాంతరం నుండి వస్తున్న వాసనలు అన్నీ భక్తి అనే పులి ముందు పారిపోతాయి. భక్తి కూడా సామాన్యంగా రాదు. మీరు

సాధన చేయాలి. మీరు ఈశ్వరుడిని ఉపాసించాలి. సజ్జనసాంగత్యం ఉండాలి. అప్పుడు కాని మీకు భక్తి కలుగదు. భగవంతుడి యొక్క నామాన్ని స్మరించగా, స్మరించగా ఆయన రూపాన్ని ధ్యానించగా ధ్యానించగా మన నామరూపముల నుండి విడుదలపొందుతాము.

నిజమైన అరుణాచలం మన హృదయంలోనే ఉంది. మనం అరుణాచలం వెళ్ళి అరుణాచలేశ్వరుడిని దర్శించటం వలన మన హృదయంలో ఉన్న అరుణాచలాన్ని దర్శించటానికి సహాయసహకారాలను ఆరూపం మనకు అందచేస్తుంది. ఆయనను స్మరించటం వలన ఆయన కృప మన మీద పడుతుంది. ఆయన కృపే హృదయంలో ఉన్న అరుణాచలేశ్వరుడి దగ్గరకు మనలను చేరుస్తుంది. నీ హృదయంలోనికి నువ్వు చేరుకొంటే మహామాయలో నుండి బయటకు వస్తావు. ఏది మాయ అంటే పుట్టటం ఒక మాయ, చనిపోవటం ఒక మాయ, నీవు నేను అనే వేరుబుద్ధి ఒక మాయ, లోపల బయట ఇది కూడా ఒక మాయ. నువ్వు హృదయగుహలోనికి వెళ్ళినప్పుడు ఈ మాయలోనుండి బయటకు వస్తావు. దేవుడు ఉన్నాడా? లేడా? అనే గొడవ అటుంచండి మీకు మనస్సు తెలుస్తోంది కదా, దానిని పవిత్రం చేయండి, మనస్సులో ఉన్న బలహీనతలను తొలగించుకోండి, అప్పుడు లోపలఉన్న వస్తువు మీకు తెలుస్తుంది. మనస్సు బయటకు వెళితే అహంకారం, లోపలకు వెళితే ఆత్మ. మనస్సు లోపలకు వెళితే శాంతి, బయటకు వెళితే అశాంతి. నువ్వు ప్రయత్నం చేసి మనస్సును కొంచెం లోపలకు పంపితే తరువాత నీ ప్రయత్నంతో సంబంధం లేకుండానే లోపలఉన్న ఈశ్వరుడు నిన్ను లాక్కొని, నీ మనస్సును మాయం చేసి, ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, అదే మోక్షం.

సాధనలో మీరు బహుజాగ్రత్తగా ఉండాలి. అశ్రద్ధ పనికిరాదు. మనం ఎక్కువగా ఏదైతే వింటున్నామో, దేనినైతే చూస్తున్నామో, దేని గురించి అయితే ఆలోచిస్తున్నామో అదే మనం అవుతాము, అందువలన వీటి విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. సృష్టిలో అంతా ఈశ్వరుడినే చూస్తూ ఉంటే, ఈశ్వరుడి గురించే వింటూ ఉంటే, ఆయననే స్మరిస్తూ ఉంటే ఆయనలో ఐక్యమవుతాము. మీరు రాతిమీద నీరు పొయ్యండి అది ఏమన్నా లాక్కొంటుందా? ఏమీ లేదు. అలాగే లౌకికులకు ఏదైనా చెప్పినా అది వారి బుర్రకు ఎక్కదు అన్నారు రామకృష్ణుడు. కొంతమంది బండరాళ్ళలాగ ఉంటారు. రాయిని తిట్టటం ఎందుకు? దానివలన మనకు నోరు నొప్పి మిగులుతుంది. కొంతమంది జీవులు కూడా అలాగే ఉంటారు, వారితో సహవాసం చేయకండి, మీరు కూడా అలాగే అయిపోతారు. 24 గంటలు లోకం గొడవలలో ఉంటే, చెడ్డ మాటలు వింటూ ఉంటే, చెడ్డ గురించి ఆలోచిస్తూ ఉంటే నువ్వు మంచివాడవు ఎలా అవుతావు. మంచితనం లేకుండా నీకు జ్ఞానం కలుగదు. ఒక

భక్తుడు భగవాన్‌తో నేను ఫలానా సత్రంకు వెళ్ళాను అక్కడ అందరినీ పట్టుకొని తిడుతున్నారు అని భగవాన్‌తో చెప్పాడు. భగవాన్ ఏమన్నారు అంటే తిట్టటం వారి పొరపాటు కాదు, అక్కడకు వెళ్ళటం నీది పొరపాటు అన్నారు. అంటే ఎక్కడికి వెళ్ళాలి, ఎక్కడకు వెళ్ళకూడదు అనే వివేకం నీకు లేదు. అక్కడకు ఎవరు నిన్ను వెళ్ళమన్నారు? అక్కడికి వెళ్ళటం నాది పొరపాటు అని అనుకోవటం లేదు, తిట్టటం వారిది పొరపాటు అంటున్నావు. అక్కడకు వెళ్ళటానికి నీ రాంగ్ థింకింగ్ కారణం అని చెప్పారు.

నా మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు వెళ్ళిపోతోంది. నువ్వు లోపల ఉండి ఇది అంతా చూస్తూ కూర్చుంటే నన్ను ఇంక కాపాడేవారు ఎవరు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. ఇంటికి దొంగలు వచ్చారు అనుకోండి, యజమాని మత్తుగా నిద్రపోతున్నాడు అనుకోండి, ఇంక రక్షించేవాడు ఎవడు? మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు పోతూ ఉంటే చూస్తూ కూర్చోవటం నీకు న్యాయంగా ఉందా? నేను పూర్తిగా పాడైపోయిన తరువాత ఇంక నీవు ఏమి చేస్తావు అంటున్నారు. యోగవాశిష్ఠంలో చెపుతాడు కొంతమంది మంచి మాటలు వినరు, చెడ్డమాటలే వింటారు. దానికి కారణం ఏమిటి అంటే వాడికి లోపల చెడ్డ ఉంది, లోపల చెడ్డ ఉన్నప్పుడు చెడ్డమాటలే వింటాడు. పశువును తాడుకట్టి లాగుతూ ఉంటే పాపం అది ఏమి చేస్తుంది మన కూడా వచ్చేస్తుంది. అలాగే నీ లోపల ఉన్న చెడు సంసారం నీ మనస్సును కట్టేసి ఆ చెడ్డ కంపెనీలోనికి నిన్ను లాగుకొని పోతుంది అని చెప్పాడు. కొంతమంది తెలియనివారు, అనుభవంలేనివారు భక్తి వలన ఏమి కలసివస్తుంది అంటారు. మనకు భక్తి వలననే అంతా కలసి వస్తుంది. అది తప్పించి మిగతాది అంతా దుమ్మే. మీరు ఏదైనా చెడ్డ అలవాటు నేర్చుకొన్నారు అనుకోండి, మీరు ఏ స్థాయిలో ఉండగా ఆ చెడుఅలవాటు నేర్చుకొన్నారో అదే స్థాయిలో ఉండి దానిలో నుండి బయటకు రాలేరు. భక్తి వలన, సజ్జన సాంగత్యం వలన, మంచిమాటలు వినటం వలన, భగవంతుడిని స్మరించటం వలన, ధ్యానించటం వలన మీ చైతన్యస్థాయి పెరుగుతుంది, అప్పుడు చెడుఅలవాట్ల నుండి బయటకు వస్తారు. చెడుఅలవాట్లలో నుండి మీరు బయటకు రావటం కాదు, అవే మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతాయి.

మీ హృదయం యొక్క లోతులు పెరగాలి, మీరు చైతన్యస్థాయిని పెంచుకోవాలి. మీరు మారు మనస్సు పొందాలి. ఎప్పుడైతే మీకు మారు మనస్సు వచ్చిందో అంతకు ముందు మీకు ఏవైనా చెడుఅలవాట్లు ఉంటే వాటిలో ఉన్న రోత మీకు తెలుస్తూ ఉంటుంది, ఆ చెడు అలవాట్లు మిమ్మల్ని ఎలా పాడుచేస్తున్నాయో మీకు తెలుస్తుంది. అయితే మారుమనస్సు

మీకు ఎలా వస్తుంది అంటే సబ్జక్టును మీరు విసుగు వచ్చేలాగ వినాలి, విన్న దానిని మననం చేయాలి, మననం చేసుకొన్నదానిని నిరంతరం ధ్యానం చేయాలి. అలా చేయటం వలన మీకు అంతర్దృష్టి కలుగుతుంది, మీ చైతన్యస్థాయి పెరుగుతుంది, చెడుఅలవాట్లలో నుండి విడిపోతారు, లోపలఉన్న సద్వస్తువు గురించి మీకు తెలుస్తూ ఉంటుంది, దాని ఆకర్షణ మీకు తెలుస్తుంది, మీకు తెలియకుండానే హృదయం యొక్క లోయలలో ఐక్యమైపోతారు. అక్కడ ఉన్న ఆనందసముద్రం మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. సారాతాగేవాడిని నువ్వు మానేయి, నువ్వు మానేయి అని చెపుతారు కాని వాడి మనస్సుకు డైవర్షన్ ఇవ్వరు. వాడి మనస్సుకు డైవర్షన్ వస్తే చెడుఅలవాటులో నుండి బయటకు వచ్చేస్తాడు. అంతేగాని నువ్వు మానేయి అని చెప్పటం వలన, వాడిని కొట్టటం వలన అందులోనుండి బయటకు రాలేడు. సత్పురుషసహవాసం వలన వాడికి డైవర్షన్ వస్తుంది.

మీ ఇంట్లో ఎవరైనా విషయానందంలో ఉంటే అందులోనుండి వారు బయటకు రావాలంటే భజనానందం అలవాటుచేయండి అని రామకృష్ణుడు చెప్పాడు. విషయానందం నుండి వారిని డైరెక్టుగా బ్రహ్మానందంలోనికి పంపలేరు. ముందు భజనానందం అలవాటు చేయండి. ఏదో భగవంతుడి నామాన్ని స్మరించుకోవటం అలవాటు చేయండి. ముందు విషయానందంలోనుండి భజనానందం లోనికి వచ్చేస్తారు. మీ కూడా తిప్పకొంటూ అలా భజనానందం అలవాటు చేయగా చేయగా మీరు పొందే శాంతి ఏమిటో వారికి తెలుస్తూ ఉంటుంది, మీ వైబ్రేషన్స్ వారిమీద పనిచేస్తాయి. ఇక్కడ ఏదో శాంతి ఉంది, సుఖం ఉంది, అది మన ఇంద్రియాలకు అందటం లేదు, మన మనస్సుకు అందటం లేదు, దానిని మనం పొందాలి అని ప్రయత్నం చేసి భజనానందంలో నుండి బ్రహ్మానందంలోనికి జంప్ చేస్తాడు. అంతేగాని మీరు వారిని బాగుపడాలి, బాగుపడాలి అంటే వారు బాగుపడలేరు. వారికి మార్గం చూపించాలి. చెడుఅలవాట్ల వలన ఇల్లు గుల్ల అవుతుంది, శరీరం గుల్ల అవుతుంది, బుద్ధి పాడైపోతుంది, మరణానంతరం నరకం, చీకటి లోకాలు మిగులుతాయి. కొంతమందిని ఇతరులు ఎవరూ పాడుచేయనక్కరలేదు, వారి దగ్గర ఉన్న డబ్బే వారిని పాడు చేస్తుంది. డబ్బు భోగాన్ని ఇస్తుంది కాని శాంతిని ఇవ్వలేదు. ఒక్కటి మీరు బాగా గుర్తుపెట్టుకోండి. మీకు వెయ్యి కోట్ల డబ్బు ఉన్నా, ఒక దేశానికి రాజు అయినా కూడా మీ బుద్ధి శుద్ధి అవ్వకుండా, మీ బుద్ధికి నెమ్మదిస్థితి రాకుండా ఏ మనిషికి సుఖం శాంతి అందదు. మీకు ఏదైతే లేదో అది ఎవరికైనా ఉంటే వారు సుఖపడుతున్నారు అని మీరు అనుకొంటారు కాని అక్కడ వారు సుఖపడటం లేదు, మీ మనస్సుకు అలా అనిపిస్తుంది.

మీరు భక్తులతో సహవాసం చేయండి. భక్తిభావనను, శరణాగతిని తక్కువగా అంచనా వేయవద్దు. మీరు పాండిత్యాన్ని ఎలా సంపాదించుకొంటున్నారో, ధనాన్ని ఎలా సంపాదించుకొంటున్నారో అలాగ కష్టపడి భక్తిని సంపాదించుకోండి. మీరు జాగ్రత్తగా భక్తిని పెంచుకొంటూ ఉంటే అహంభావన యొక్క పట్టు తగ్గిపోతుంది. భక్తి పెరిగేకొలదీ వ్యక్తి భావనలో నుండి బయటపడతారు, భక్తి పెరిగే కొలది హృదయగ్రంథి తెగిపోతుంది. భక్తిలో ఏముంది? శరణాగతిలో ఏముంది? అనుకోవద్దు. మీ మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు వెళ్ళి లోకంలో తిరుగుతోంది. మనస్సుకు ఉన్న ఆ అలవాటును భక్తి వేరుతో సహా నశింపచేస్తుంది, అది భక్తియొక్క వైభవం, శరణాగతి యొక్క వైభవం. ముందు మనం కోరికలకోసం దేవుడి దగ్గరకు వెళతాము. ఆ కోరిక నెరవేరుతుంది. కోరిక నెరవేరటం వలన మనకు భక్తి పెరుగుతూనే ఉంటుంది. మీరు కోరికల కోసం గుడికి వెళ్ళినా ఇబ్బంది లేదు. అలా కొంతకాలానికి ఏమౌతుంది అంటే చాలా కోరికలు నెరవేరాయి కాని ఇంకా శాంతి అందటం లేదు అని మనకు లోపల తెలుస్తూ ఉంటుంది, అప్పుడు శాంతి కోసం ప్రయత్నం చేస్తాము. కొంతమందికి ఈశ్వరుడి మీద పరిపూర్ణమైన ప్రేమ ఉంటుంది, కారణం కనబడదు అంటే భక్తి ఉంటుంది, విశ్వాసం ఉంటుంది కాని కోరిక ఉండదు. అటువంటి భక్తి వలన మీకు జ్ఞానం కలుగుతుంది, సత్యసాక్షాత్కారం కలుగుతుంది. కొంతమంది మాకు భక్తే చాలు ముక్తి వద్దు అంటారు. అంటే భక్తిలో కూడా అంత వైభవం ఉంది. భక్తిలో కూడా అంత ఏకాగ్రత వచ్చేస్తుంది, మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది.

మీ మనస్సును ఆగమంటే ఆగటం లేదు, నా మనస్సును కదలమంటే అది కదలటం లేదు అన్నారు భగవాన్ ఇంక వాడికి యోగంతో పని ఏముంది. రోగం ఎలా ఉంటుందో తెలియనివాడికి మందు తోటి పని లేదు అలాగే వియోగం ఎలా ఉంటుందో తెలియనివాడికి యోగంతో పని లేదు. నువ్వు ఈ జన్మలోనే తరించాలి అనుకో దానికి ఒకటే ఉపాయం ఉంది అంటాడు రామకృష్ణుడు. దొంగవాడు ఒక ఇంటికి దొంగతనం చేయటానికి వచ్చాడు అనుకో. అక్కడ ఒక గదిలో కోట్ల డబ్బు ఉంది అనుకో. ఆ దొంగవాడు నిద్రపోడు, అందరూ ఎప్పుడు నిద్రపోతారా మనం ఆ గదిలోనికి వెళ్ళి డబ్బు ఎప్పుడు పట్టుకొనిపోదామా అని చూస్తుంటాడు. వాడు నిద్రను బలవంతంగా ఆపుచేసుకోడు సహజంగానే నిద్ర లేకుండా ఉంటాడు. ఆ డబ్బు ఎప్పుడు పట్టుకొని పోదామా అని ఆ దొంగకు కాంక్ష ఎంతవేగంగా ఉంటుందో, ఈశ్వరుడిని పొందాలి అనే కాంక్ష నీకు అంత వేగంగా ఉంటే ఈ జన్మలోనే నీవు తరిస్తావు అని చెప్పాడు. దొంగ యొక్క గురి అంతా ఆ ధనం మీద ఎలా ఉంటుందో

అలాగ ఈశ్వరుడి పాదాల మీద మీకు గురి ఉంటే ఎప్పుడో కాదు ఇప్పుడే మీరు మోక్షాన్ని పొందుతారు.

ఉన్నవాడు ఈశ్వరుడు ఒక్కడే. ఇన్ని రూపాలలో, నామాలలో కనిపించేవాడు ఆయనే. నీ రూపబుద్ధిని, నామబుద్ధిని ఒక ప్రక్కన పెట్టి చూస్తే ఉన్నవాడు ఆయన ఒక్కడే. ఈశ్వరుడికి భిన్నంగా ఏదీ లేదు. ఈశ్వరుడికి భిన్నంగా మనకు ఏదైనా కనిపిస్తూ ఉంటే అది మన అజ్ఞానం కారణం వలన అలా కనిపిస్తోంది కాని నిజంగా అక్కడ ఏమీ లేదు. ఆకాశంలో సూర్యుడు ఉన్నాడు నీ కళ్ళకు గుడ్డితనం వస్తే సూర్యుడు ఆకాశంలో ఉన్నా నీకు కనబడడు. నువ్వు అజ్ఞానం అనే గుడ్డితనంలో కూరుకుపోతే నీ హృదయంలో జ్ఞానసూర్యుడు ఉన్నా ఆయన నీకు గోచరించడు అంటే వాడు లేకపోవటం వలన కాదు నీకు చూసే శక్తి లేక ఆయన గోచరించటం లేదు. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనం సమానంగా ఉండగలగాలి. అలాకాకుండా మనం రోజుకు ఒకరకంగా ఉంటాము అనుకోండి దేహాత్మబుద్ధి పెరిగిపోతుంది, దొంగ నేను పెరిగిపోతుంది. ఈ దొంగ నేనును తీసి ఒక ప్రక్కన పెడితే ఏమీ లేదు అప్పుడు ఉన్నదే సుఖం, ఉన్నదే శాంతి. దైనందిన జీవితంలో మనం ఈ దొంగనేనును శాటిస్‌ఫై చేయకూడదు. జనరల్‌గా ప్రతీ మానవుడు వాడి అహంకారాన్ని సంతృప్తిపరచటానికే బతుకుతూ ఉంటాడు, కాని మనం భగవంతుడి కోసం బతకాలి.

ఒకసారి రామకృష్ణుడు వివేకానందుడు కూర్చుని మాట్లాడుకొంటున్నారు, అక్కడ ఇంకా భక్తులు ఉన్నారు. అప్పుడు వివేకానంద బిఏ చదువుతున్నాడు. అప్పుడు వాడికి కొన్ని నాస్తికభావాలు ఉండేవి. కృష్ణుడు భగవద్గీతలో ఇలా చెప్పాడు అని రామకృష్ణుడు చెపుతూ ఉంటే కృష్ణుడే భగవద్గీత చెప్పాడని ఏమిటి, ఎవరో వ్రాసింది తీసుకొనివచ్చి భగవద్గీత మధ్యలో పెట్టారేమో, కృష్ణుడే చెప్పాడని నమ్మాలని ఎక్కడ ఉంది అన్నాడు వివేకానంద. వీడి మీద చాలా ఆశపెట్టుకొన్నాను, ఇంత విశ్వాసహీనుడు అవుతున్నాడు ఏమిటి అని రామకృష్ణుడు నివ్వెరపోయాడు. నీవు విశ్వాసహీనుడవు అవుతున్నావని వివేకానందతో అనలేదు. సహవాస దోషం వలన అలా మాట్లాడుతున్నాడేమో అనుకొని వివేకానందను దగ్గరకు తీసుకొని నెమ్మదిగా నిమిరి ఆయన శక్తితో స్వామీజీని నింపుతాడు. వీడి ద్వారా లోకక్షేమం కోసం ఎంతో పని జరగవలసి ఉంది, వీడు పాడవకుండా ఉండటం కోసం చుట్టూ రక్షణగా కంచె వేస్తాడు. వాడే రామకృష్ణుడు. ఎందుచేతనంటే మొక్కగా ఉన్నప్పడే కంచె అవసరం. మీ ఇంటి దగ్గర పిల్లలు ఉన్నారు అనుకోండి వారు పెద్దవారు అయ్యాక వారిని మీరు స్నేహితులుగా

చూడవచ్చు కాని చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వారి చుట్టూర కంచె ఉండాలి, వారికి ప్రొటెక్షన్ అవసరం. జాగ్రత్తగా వారి గుణాలు ఏమిటి? వారి అలవాట్లు ఏమిటి? వారు మాట్లాడే పద్ధతి ఎలా ఉంది? ఇవి అన్నీ మీరు జాగ్రత్తగా చూసుకోవాలి.

భగవాన్ అంటున్నారు నీ అహంకారమే నీకు బంగారంలాగ కనిపిస్తోంది. నీ అహంకారమే సొమ్ము అనుకొంటున్నావు. అది దుమ్ము అని నీకు తెలియటం లేదు. ఆ దుమ్మే సొమ్ము కింద నీకు కనిపిస్తోంది. ఎందుకు పనికిరానిదే నీకు బంగారం కింద కనిపిస్తోంది. అందుచేత దానిని విడిచిపెట్టలేకపోతున్నావు. దీనిని విడిచిపెడితే పాడైపోతానని అనుకొంటున్నావు. సత్పురుషుల సహవాసం వలన, గురువు అనుగ్రహం వలన క్రమేపీ స్లోగా ఈ అహంకారం ఎందుకు పనికిరానిది, ఇది గడ్డిపరక విలువ కూడా చేయదు, దీనికంటే పేడ మెరుగు, పేడకు ఉన్న విలువ కూడా అహంకారానికి లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఈ అహంకారంను వదిలేస్తే నీవు పాడైపోవు, భగవంతుడి యొక్క స్వరూపం నీకు దొరుకుతుంది. ఒక చిన్న మాట చెపుతున్నాము. శరీరం ఏదో రోజున చనిపోతుంది, ఈ శరీరంతో తాదాత్మ్యం పొందే జీవుడు చనిపోడు, వాడు కొత్త దేహం ధరిస్తాడు. ఆ జీవుడిని మనం బాగుచేసుకోవాలి. స్మశానం వరకు వచ్చి ఆగిపోయే శరీరానికి ఇచ్చే ప్రాముఖ్యత జీవుడికి ఇవ్వటం లేదు. మన కూడా వచ్చే వాడు జీవుడు అందుచేత వాడిని బాగుచేసుకోవాలి. అంటే ఆ జీవుడిలో మంచితనం పెంచుకొని, వాడిలో ఉన్న జీవలక్షణాలను పోగొట్టుకొంటే ఆ జీవుడే దేవుడితో సమానం అయిపోతాడు. జీవుడు దేవుడు లేకుండా లేడు. అందుచేత మనం ఏమి చేయాలి అంటే దైవీగుణాల సహాయం తీసుకొని జీవగుణాలను తొలగించుకొంటే అప్పడు ఈ జీవుడే దేవుడు అన్న సంగతి మీకు అనుభవంలోనికి వస్తుంది. దైవగుణాలను పెంచుకొంటూ ఉంటే దేవుడే మనకు స్వరూపంగా వ్యక్తమౌతాడు. ఒకసారి అనిబిసెంట్ అంటుంది ఓ ఈశ్వరుడా కొంతమంది జీవులు నన్ను అగౌరవపరుస్తున్నారు. కాని నీవు నన్ను ఎప్పడూ అగౌరవపరచటం లేదు, నన్ను చాలా మర్యాదగా చూస్తున్నావు. నన్ను చాలా గౌరవంగా చూడటమే కాదు ఏదీ నాది కాదు, ఏదీ నేను కాదు అనే బుద్ధిని కూడా నువ్వే నాకు ప్రసాదించావు. ఒకవేళ జీవకోటిలో కొంతమంది నన్ను అగౌరవపరుస్తున్నా నీవు మాత్రం నన్ను గౌరవంతో నింపుతున్నావు, నన్ను ఎప్పడూ దయగానే చూస్తున్నావు. నీ ప్రేమను, ఆప్యాయతను ఎలా తట్టుకోగలను, నీ ఋణం ఎలా తీర్చుకోగలను అంది అనిబిసెంట్. ఆవిడది మన దేశం కాదు. ఈ దేశానికి వచ్చింది, ఈ దేశాన్ని ప్రేమించింది, ఈ దేశం కోసం జీవించి ఇక్కడే మట్టిలో కలిసిపోయింది.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-05-06, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీకు అవకాశం ఉంటే వారానికి ఒకసారి గుడికి వెళ్ళిరావటం మంచిది. భగవంతుడు ఈ జీవకోటిని తయారుచేసి, పంచభూతాలను తయారుచేసి వదిలేయలేదు, అందరిలోను అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి అవకాశం లేదు. భగవంతుడు సంకల్పం జరుగుతుంది కాని మీరు అనుకొన్నది, నేను అనుకొన్నది జరుగదు. ఒకోసారి ఆయన సంకల్పం, మన సంకల్పం కలుస్తుంది. ఆ పని మనం సాధించేసాము అనుకొంటాము కాని మనం సాధించింది కాదు ఆయన సంకల్పించాడు కాబట్టి ఆ పని జరిగింది. ఆయన సంకల్పం మన సంకల్పం కలిసినప్పుడు, ఆయన సంకల్పం మన సంకల్పం కలవనప్పుడు కూడా జరిగేది ఆయన సంకల్పమే. అసలు ఉన్నది ఆయన ఒక్కడే. మన అహంభావనను బట్టి మనం కూడా ఉన్నాము అనుకొంటున్నాము. భగవంతుడిని కాదని, ఆయనకు భిన్నంగా మనం ఏదో చేయాలని అనుకొంటున్నాము కాని ఆయనను కాదని మనం ఏమీ చేయలేము. ఏ జీవుడు సర్వజ్ఞుడు కాదు. భగవంతుడు మనకు ఎంతైతే అనుగ్రహించాడో అంతవరకే మనకు తెలుస్తుంది కాని అంతకు మించి ఏమీ తెలియదు. మీలో ఎవరికైనా తెలివితేటలు ఉన్నాయి అనుకోండి, ఐశ్వర్యం ఉంది అనుకోండి, ఏదైనా ఒక పని చేయగల సమర్థత ఉంది అనుకోండి, మీలో ఏదైనా ఒక ప్రత్యేకత ఉంది అనుకోండి అది మీ సొంతం ఏమీ కాదు, భగవంతుడు ఇస్తే మీకు వచ్చింది కాని అది మీ సొంతం అనుకోవద్దు. మన సొంతం అంటూ ఇక్కడ ఏమీ లేదు. మనం పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా ఇది ఎందుకు చేస్తున్నాము అని లోపల చూసుకొంటూ ఉండాలి.

మనకు నేను అనే తలంపు ఎప్పుడైతే ఉందో దాని కూడా నాది అనే తలంపు ఉంటుంది. మనం అజ్ఞానంలో ఉన్నంతసేపు ఇదంతా నాదే అనుకొంటాము. అజ్ఞానం నుండి విడుదల పొందాక ఇదంతా ఈశ్వరుడిదే అని మనకు తెలుస్తుంది. ఈశ్వరుని దయ లేకుండా మనం భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని ఏమీ పొందలేము. మీరు అందరూ సాధకులు, మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. ధనం కంటే కాలం ఎక్కువ విలువైనది. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ తలకాయపోటు తెచ్చుకోవద్దు. మన కంట్రోలర్ మన హృదయంలోనే ఉన్నాడు. ఆయన మన కళ్ళకు కనబడటం లేదు అని ఆయన లేడు

అని అనుకోవద్దు. పుష్పంలో వాసన ఉంటుంది అది మన కళ్లకు కనబడదు. ముక్కుతో వాసన చూస్తే తెలుస్తుంది. ఎందుచేతనంటే ఆశక్తి ముక్కుకే ఉంది కాని కంటికి లేదు. అలాగే నీకు ఆధ్యాత్మికశక్తి పెరుగుతున్నప్పడే, చైతన్యస్థాయి పెరుగుతున్నప్పడే లోపల ఉన్న అంతర్యామి నీకు అనుభవంలోనికి వస్తాడు. జీవితంలో జరిగిన సంఘటనల నుండి పాఠాలు నేర్చుకొని ఆ అనుభవంతో ఇప్పడు ఎలా జీవించాలో చూసుకోండి. వర్తమాన కాలాన్ని పాడుచేసుకోవద్దు. వర్తమానకాలాన్ని సద్వినియోగం చేసుకొంటే భవిష్యత్ గురించి మనం కంగారుపడవలసిన అవసరం లేదు. చాలామంది జరిగిపోయినగొడవలు తలపెట్టుకొంటూ దుఃఖపడతారు, భవిష్యత్ గురించి గాలిమేడలు కడతారు, చేతిలో ఉన్న వర్తమానకాలాన్ని వదిలేస్తారు. మీకు ఎన్నిరకాల దుఃఖాలు ఉన్నా సరే సబ్జక్టును బాగా శ్రవణం చేస్తూఉంటే, అర్థం చేసుకొంటూ ఉంటే అన్నిరకాల దుఃఖాల నుండి ఇప్పడే విడుదల పొందుతారు. మీకు లోపల ఎంత దుఃఖం ఉన్నా ఫరవాలేదు, గడ్డిమేటు ఎంత పెద్దది అయినా చిన్న అగ్గిపుల్లకు లోకువ, అలాగే మీకు లోపల ఎన్నిరకాల దుఃఖాలు ఉన్నా జ్ఞానాగ్ని వచ్చినప్పడు అన్ని బాధల నుండి, అన్ని ఎమోషన్స్ నుండి అన్నిరకాల దుఃఖాల నుండి బయటకు వచ్చేస్తారు. మీరు భక్తి గురించి శ్రవణం చేస్తే సరిపోదు. మీరు విన్న మాటలను మనస్సులో తిప్పకోవాలి. మీరు విన్న మాటలు మీ మనస్సులో గంతులేస్తూ ఉండాలి, దానివలన మీకు ఎంజాయ్‌మెంట్ రావాలి, ఆ మాటలలో ఉన్న అర్థాన్ని మీ మనస్సు లోపలకు తీసుకొంటూ ఉండాలి. మీరు విన్న మాటలను మననం చేస్తూ ఉంటే మీకు తెలియకుండా ఆ మాటలను ధ్యానం చేస్తారు, అప్పడు ఆ మాటలు మీకు అర్థమవుతాయి, ఆ మాటలు మీ సొంతమవుతాయి. అప్పడు సుఖం తెలుస్తుంది కాని కేవలం విన్నంత మాత్రంచేత వచ్చేయదు.

మీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి, ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పడు ఎంత కేర్‌ఫుల్‌గా ఉంటామో అనుకూలంగా ఉన్నప్పడు కూడా అంత కేర్‌ఫుల్‌గా అంత జాగ్రత్తగా ఉండాలి. అలా ఉండటం వలన ఇంద్రియాలకు నిగ్రహం వస్తుంది, మనస్సుకు నిగ్రహం వస్తుంది. మనం ఏ పని చేయాలన్నా మనోనిగ్రహం ముఖ్యం, ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. మన నిజమైన ఇల్లు మన హృదయంలోనే ఉంది. మన మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తున్నప్పడు ఈశ్వరుడు చెప్పిన మాటలు మనకు అర్థమవుతాయి కాని లేకపోతే మన తలను గోడకువేసి కొట్టుకొన్నా అర్థంకావు. మనం ఇట్టిదగ్గర ఏకాంతంగా కూర్చొని మన మనస్సు ఏ విషయం వైపుకు లాగబడుతోంది, ఎందుకు లాగబడుతోంది అని చూసుకొని

ఆ విషయంలో నుండి మనస్సును వెనక్కి మళ్ళించుకోవటమే సాధన. అది అందరికీ మూకుమ్మడిగా చెప్పేదికాదు, ఎవరి మనస్సును వారు పరిశీలన చేసుకోవాలి. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తున్నారు అనుకోండి, కంగారుపడవద్దు. మనం ఇతరులను విమర్శిస్తే పాడవుతాము కాని ఇతరులు మనలను విమర్శించటం వలన మనం బాగుపడతాము అది వారికి తెలియదు. మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉన్నాయేమో చూసుకొని వాటిని మనం సరిచేసుకోవచ్చు. అప్పడు బుద్ధిలో ఉన్న దోషాలు పోతాయి, ఏకాగ్రత కలుగుతుంది, లోపల తూకం పెరుగుతుంది.

మీకు సంతోషం వచ్చింది అనుకోండి, మీకు దుఃఖం వచ్చింది అనుకోండి ఈ శరీరం వాటిని అనుభవించదు, లోపల ఉన్న జీవుడు అనుభవిస్తాడు. శరీరం ట్రైనింగ్ పొందటానికి మనం ఈ భూమి మీదకు రాలేదు. ఈ శరీరం నాది, ఈ శరీరమే నేను అని చెప్పే లోపల ఉన్న జీవుడు ట్రైనింగ్ పొందటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము. మనకు అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా మీ బ్రెయిన్‌ను ఎంతవరకూ బేలెన్స్ చేసుకొంటున్నారో ఈశ్వరుడు చూసుకొంటాడు. మీకు సమత్వబుద్ధి వచ్చేవరకూ మిమ్మల్ని మట్టిలో కలిపేస్తాడు, ప్రకృతిలో పడేస్తాడు, ప్రతిజన్మకు దేహం మారుస్తాడు మానవశరీరం రావచ్చు, జంతుశరీరం రావచ్చు. మనకు భక్తి ఎందుకు అంటే ఎక్కడో ఉన్న దేవుడిని చూడటంకోసం కాదు. ఈశ్వరుడు మనలను సృష్టించి గాలికి వదిలేయలేదు, ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. ప్రారబ్ధం ప్రకారం మనలను నడిపిస్తున్నాడు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడికి మనకు దూరం తగ్గటానికే భక్తి, ఆయనలో ఐక్యమవ్వటానికే భక్తి. ప్రతీ మనిషికి భక్తి అవసరం. భక్తి లేకుండా ధర్మాన్ని ఆచరించలేడు, భక్తి లేకపోతే మనస్సు వికసించదు. భక్తి లేకుండా భగవంతుడు తెలియబడడు. మానసికఆరోగ్యం కావాలంటే భక్తిని అలవాటు చేసుకోవాలి. భక్తి వలన సత్వగుణం వస్తుంది, రియాక్షన్ తగ్గుతుంది. నీవు నోటితో ఒక మాట మాట్లాడితే, చేతితో ఒక పని చేస్తే, మనస్సులోనికి ఒక ఆలోచన వస్తే ఇది ఎందుకు చేస్తున్నాడు, ఏ ప్రయోజనం ఆశించి చేస్తున్నాడు, గౌరవాల కోసం చేస్తున్నాడా లేక ఈశ్వరుడు సంతోషిస్తాడు అని చేస్తున్నాడా అని అతి పరిశీలనగా ప్రతీ చిన్న తలంపును కూడా భగవంతుడు చూస్తూ ఉంటాడు. వాడే సాక్షి, వాడే పరమేశ్వరుడు. భగవంతుడు లేడు అని జీవించటం కంటే భగవంతుడు ఉన్నాడని జీవించటం వలన మనం తొందరగా బాగుపడతాము. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. అది తెలియకపోతే దుఃఖం నిన్ను వెంటాడుతుంది, తెలిస్తే సుఖసముద్రంలో ఈదులాడతావు. చేప ఏవిధంగా

అయితే నీటిలో ఈదులాడుతూ కేరింతలు కొడుతుందో అలాగ లోపలఉన్న భగవంతుడు నీకు అనుభవం లోనికి వచ్చినప్పుడు నీ మనస్సు ఆనందసముద్రంలో ఈదులాడుతూ ఉంటుంది. అప్పుడు మనం సుఖం కోసం బాహ్యవస్తువుల మీద, వ్యక్తుల మీద ఆధారపడ నక్కరలేదు.

సుఖం అనేది, శాంతి అనేది బయట ఎక్కడా లేదు. ఉన్నదంతా లోపలే ఉంది. నీకున్న అజ్ఞానం వలన బయట ఏదో ఉంది అనుకొంటున్నావు. లోపల ఉన్న అంతర్యామిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ట్రైనింగ్ పొందటానికే ఈ భూమి మీదకు వచ్చావు కాని వచ్చిన పని మర్చిపోతున్నావు. మీ గదిలో లోపల లైటు వెలుగుతోంది అనుకోండి, తలుపులు వేసేసి ఉన్నాయి అనుకోండి, మీరు గది లోపలకు వెళ్ళకపోయినా గది వంక చూస్తూ ఉంటే లోపల లైటు ఉందని తెలుస్తూ ఉంటుంది. అలాగే మీలో ఎవరికైనా జ్ఞానం ఉంది అనుకోండి జ్ఞానం ఎవరికీ తెలియకూడదు అని మీరు అనుకొన్నా, మీరు దాచుకొన్నా అది మీ కళ్ళద్వారా, మాటద్వారా, మీ ప్రవర్తనద్వారా వ్యక్తమవుతూ ఉంటుంది. అసలు ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనేటువంటి విశ్వాసం మనకు లేదు. అందుచేత మనకు దుఃఖం వస్తోంది. భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం ముందు మనకు కుదరాలి. మీ చెవులు సరిగా పనిచేయటం లేదు అనుకోండి, కొంచెం వినిపెట్టు అని కళ్ళను అడుగుతారు అనుకోండి, వినటం నాకు చేతకాదు అని కళ్ళు చెపుతాయి. అలాగే బుద్ధి కూడా అది ఎంత వరకు ఆలోచించగలదో అంతవరకే ఆలోచిస్తుంది కాని అంతకంటే దూరం నేను వెళ్ళలేను అని చెపుతుంది. అది ఎంతదూరం తీసుకొని వెళ్ళగలదో అంతదూరం తీసుకొని వెళుతుంది. తరువాత మన విశ్వాసం మీద, ఈశ్వరుని దయమీద ఆధారపడి హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళవలసిందే. కేవలం నీ తెలివితేటలు, నీ రీజను హృదయం యొక్క లోయల లోనికి తీసుకొని వెళ్ళలేవు. తెలివి అవసరమే కాని కేవలం నీ తెలివితేటల వలన అంతర్యామి నీకు తెలియబడడు.

నీవు నేను అణగ నిత్యఆనందమయముగ నిలుచుస్థితి కరుణింపు అరుణాచలా అన్నారు అక్షరమణమాలలో భగవాన్. నీవు అనేది ఒక తలంపు, నేను అనేది ఒక తలంపు. ఈ రెండు తలంపులు ఒకోసారి అణిగిఉంటాయి. ఇవి అణిగిఉన్నప్పుడు లోపల ఆనందం మనకు తెలుస్తూ ఉంటుంది. అవి మరల విజృంభిస్తూ ఉంటాయి. ఈ రెండు తలంపులు వేరుతో సహా నశించే వరకూ సాధన చేస్తూ ఉండవలసిందే. భగవంతుడు చెప్పిన మాటలు అర్థం చేసుకోవటానికి నీ బుద్ధి సమాయత్తం అయి ఉంటే ఒక్కమాట చాలు. నేను, నీవు అనే రెండు తలంపులు పూర్తిగా వేరుతో సహా నశించాలి, అవి నశించేవరకు నువ్వు కోటి

జన్మలు ఎత్తినా దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. లోపలఉన్న ఈశ్వరుడు ఎంత పవిత్రుడో మన బుద్ధి అంత పవిత్రం కాలేదు అనుకోండి, మనకు అంత ఏకాగ్రత లేదు అనుకోండి మనం పరమాత్మలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేసినా రిజక్టు చేస్తుంది, వాడు తలుపులు తియ్యడు మూసేస్తాడు, మూసేసినా ఫరవాలేదు నీవు ఎవడివో నాకు తెలియదు అంటాడు.

స్వామీజీ ఒకమాట చెప్పారు. నారాయణుడు దేవుడు అని అందరికీ తెలుస్తోంది, నరుడు కూడా దేవుడే, నరుడు కూడా నారాయణుడే అన్న సంగతి చాలామందికి తెలియటంలేదు. అందుచేత నరుడులోకూడా నారాయణుడిని చూస్తే నువ్వు అయ్యేది నారాయణుడివే అంటాడు. నరుడికి నీవు సేవ చేస్తే అది నరరూపంలో ఉన్న నారాయణుడికే వర్తిస్తుంది. ఇప్పుడు మీరు ఆకలి వేసిన వారికి అన్నం పెట్టారు అనుకోండి, బట్టలు లేని వారికి బట్టలు ఇచ్చారు అనుకోండి మీరు నరుడికి ఇచ్చాము అనుకొంటున్నారు కాని మీరు నరుడికి ఇవ్వటం లేదు నారాయణుడికే ఇస్తున్నారు. అక్కడ నారాయణభావంతో మీరు పనిచేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతారు. ఎప్పుడైతే ఆయన అనుగ్రహానికి పాత్రులయ్యారో మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఎక్కడ ఏ రూపం వచ్చినా, ఏ నామం వచ్చినా నారాయణుడు అంతర్యామిగా లేకుండా ఏ రూపం ఉండదు, ఏ నామం ఉండదు, ఈ జీవుడు ఎవరి అంశ అంటే నారాయణుడి అంశే. జీవుడు తను నారాయణ స్వరూపం పొందే వరకూ వాడు జీవుడు, జీవుడు అనుకొంటాడు, ఏ శరీరం వస్తే ఆ శరీరంతో తాదాత్మ్యం పొందుతాడు. తాను నారాయణుడినే అన్న సంగతి వాడికి అనుభవంలోనికి వచ్చినప్పడు వాడు తిరిగి ఈ మాంసపు ముద్దలు ధరించనక్కరలేదు. ఇంకొకటి గుర్తుపెట్టుకోండి. మీరు ఇప్పడు శాంతిగా ఉన్నారు అనుకోండి, రేపు ఈ శాంతి పోతుంది. మీరు అనుకొన్న పనులు అన్నీ అవుతున్నాయి అనుకోండి అప్పడు కొంత శాంతిగా ఉంటారు. మీ కోరికలు నెరవేరుతున్నాయి అనుకోండి అప్పడు కొంచెం శాంతిగా ఉంటారు. అవి అన్నీ నిజంకాదు, తాత్కాలికం. నీవు, నేను అనే బేధబుద్ధి నశించేవరకూ నిజమైన శాంతి మీకు రాదు, పునర్జన్మ లేనిస్థితిని పొందలేరు.

సాధన అంటే కేవలం గుంజీలు తీయటం కాదు. మనం రోజూ ఏవో మాట్లాడతాం, ఏదో మాట్లాడేసాము అనుకొంటాము. రోజూ పనులు చేస్తాము, ఏవో చేసేసాము అనుకొంటాము. మనస్సులో ఏదో ఆలోచిస్తాము, ఏవో ఆలోచనలు వచ్చాయి అనుకొంటాము. కాని ఇవి అన్నీ ఏమి చేస్తాయి అంటే పోస్టాఫీసులో పోస్టుమాన్ కార్డుల మీద ఎలా ముద్రలు వేస్తాడో అలాగ మన మనస్సు మీద ముద్రలు వేసి వెళ్ళిపోతాయి. మరల ఆ ముద్రలు

కడుక్కోవటానికి కొన్ని వేల జన్మలు పడతాయి. అందుచేత సాధకుడు మాట్లాడే మాట దగ్గర, చేతితో చేసే పని దగ్గర, ఆలోచనల దగ్గర బహుజాగ్రత్తగా ఉండాలి. నువ్వు ఏదో పనిచేసి ఆ పని పూర్తి అయిపోయింది అనుకొంటున్నావు. ఆ పని కేవలం దేహాభిమానం తోటి, నూటికి నూరు పాళ్ళు స్వార్థం తోటి చేసావు అనుకో ఆ పని అయిపోయింది రైటే కాని ఆ పని తాలుక సంస్కారం నీలోపల పడిపోతుంది, ఆ సంస్కారాన్ని తొలగించుకోవటానికి కొన్ని వందల జన్మలు పట్టవచ్చు. మాట, చేత, తలంపుల దగ్గర జాగ్రత్తగా లేకపోతే నీవు పవిత్రుడవు అవ్వలేవు. ఈ మూడింటిలో అజాగ్రత్తగా ఉంటే వాసనలు పెరిగిపోతాయి, అవే పునర్జన్మకు కారణం అవుతాయి. మనం ప్రార్థన చేసేటప్పడు కూడా స్వార్థంతో చేస్తాము. మనం గుడికి వెళ్ళి స్వార్థంతో దేవుడిని ప్రార్థిస్తాము. ఒకవేళ మీకు ఆ కోరిక నెరవేరవచ్చు కాని మీరు పవిత్రులు అవ్వలేరు, మీకు దేవుడు దొరకడు, ఇది బాగా అర్థం చేసుకోండి. మనం గుడికి వెళ్ళినప్పడు పూజలు చేస్తాము అవి ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నామో లోపల ఉన్న అంతర్యామి చూసుకొంటూ ఉంటాడు. మనం పూజ పూజకోసమే చేస్తూ ఉంటే భగవంతుడు మన అవసరాలు తీరుస్తాడు, మోక్షం కూడా ఇస్తాడు. భగవంతుడు అడిగిన వారికి అడిగినదే ఇస్తాడు, అడగని వారికి అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు. మనం ఏమనుకొంటున్నాము అంటే కోరికలేకపోతే ఆ పని అవ్వదేమో అనుకొంటాము, మన కోరికతో సంబంధం లేకుండా దేహప్రారబ్ధంలో ఉంటే ఆ పని పూర్తయిపోతుంది.

ప్రతీజీవుడు తల్లిగర్భంలో తొమ్మిదినెలలు ఉంటాడు, అక్కడ వాడి శరీరం తయారవుతుంది. తల్లిగర్భంలో ఆ శరీరం తయారయ్యేటప్పడు ఆ జీవుడికి ఎంతోకొంత పోరాటం ఉంటుంది, తల్లిగర్భంలో నుండి బయటకు వచ్చేటప్పడు మరల ఎంతోకొంత పోరాటం ఉంటుంది. ఆ శరీరం నెమ్మదిగా పెరుగుతుంది, ముసలితనం వస్తుంది, రోగాలు ప్రారంభమవుతాయి, అదో రకమైన దుఃఖం. అలా కొంతకాలం ఉన్నాక ఆ శరీరం చనిపోతుంది. చనిపోయేటప్పడు నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అనుకొంటూ ఏడుస్తాడు, అదో రకమైన దుఃఖం. నేను చనిపోతున్నాను అనుకొనేవాడు నిజంగా చనిపోతే మనం అదృష్టవంతులమే, వాడు చనిపోడు. వాడు భౌతికమైన అగ్ని వలన చావడు, జ్ఞానాగ్ని వలన చనిపోతాడు. ప్రతీ జీవుడు ఈ దుఃఖాలను అనుభవించే వాడి శరీరం పోతుంది, అయితే ఆ దుఃఖం శరీరం అనుభవించటం లేదు, జీవుడు అనుభవిస్తున్నాడు. అందుచేతనే భగవాన్ ఏమన్నారు అంటే ఈ శరీరం భౌతికమైన అగ్నికి ఆహుతి అవ్వకముందే ఓ అరుణాచలేశ్వరుడా నీ జ్ఞానాగ్నిని పంపించి ఈ జీవలక్షణాలను నాశనం చెయ్యి అన్నారు. అప్పడు నీకు, నాకు

బేధంలేనిస్థితి కలుగుతుంది, ఎప్పుడైతే అబేధస్థితి కలిగిందో వాడు అభయస్థితిని పొందుతాడు, వాడు నిర్వాణసుఖాన్ని పొందుతాడు. ఒకమాట మీరు గుర్తు పెట్టుకోండి. అహంకారికి శరీరం ఉండాలి, ఆత్మకు శరీరంతో పనిలేదు. ఎప్పుడైతే మనకు ఆత్మజ్ఞానం కలిగిందో అప్పుడు ఈ శరీరంతో మనకు పనిలేదు అని మనకు తెలుస్తుంది, వాడికి పునర్జన్మ లేదు. అజ్ఞానికి శరీరం ఉండాలి, జ్ఞానికి శరీరంతో పనిలేదు, శరీరాన్ని ఏమి చేసుకొంటాడు, వాడు కాళ్ళు లేకుండా నడవగలడు, చెవులు లేకుండా వినగలడు, కళ్ళు లేకుండా చూడగలడు. వాడు జ్ఞాని. కృష్ణుడు భాగవతంలో ఒక మాట చెప్పాడు. లోకకంఠకులనందరిని ఈ లోకంలో నుండి తొలగించటానికి నేను ఒక శరీరం తొడుక్కొని వచ్చాను. ఈ శరీరాన్ని పనిముట్టుకింద ఉపయోగించుకొని ఈ లోకకంఠకులనందరినీ తొలగించి తరువాత నా శరీరం కూడా తీసేసుకొంటాను అన్నాడు కృష్ణుడు. కృష్ణుడు ఎవరి శరీరాలను అయితే తీసేసాడో వారు అందరూ మేం చనిపోతున్నాము, మేం చనిపోతున్నాము అని ఏడుస్తూ చనిపోయారు. కాని కృష్ణుడు తన శరీరాన్ని ఉపసంహరించుకొన్నప్పుడు ఆయన ఏడవలేదు ఎందుచేతనంటే ఆ శరీరంలో ఉన్నప్పుడు కూడా ఆ శరీరం తానుకాదని ఆయనకు తెలుసు.

మీరు ఎవరైనా మంచివారు అనుకోండి. మేము మంచివారము, మేము మంచి వారము అని అనుకోవద్దు, దానివలన మీరు పాడైపోతారు. మంచి, చెడు కూడా మాయలోనే ఉన్నాయి. మంచిని పెంచుకోమని పరమాత్మ ఎందుకు చెప్పాడు అంటే మాయలో నుండి బయటకు రావటానికి మంచి సహకరిస్తుంది కాబట్టి మంచిని పెంచుకోమని చెప్పాడు అంతేగాని అదే గమ్యం కాదు. ఒక బెంగ తరువాత ఇంకో బెంగ, ఒక కష్టం తరువాత ఇంకో కష్టం, ఒక కోరిక తరువాత ఇంకో కోరిక వస్తోంది, ఇంక మా జీవితాలు ఇలా వెళ్ళిపోవలసిందేనా, ఈ ప్రకృతిలో నుండి మాకు విడుదల లేదా? ఇందులో నుండి మేము విడుదల పొందాలి అంటే మేము ఏమి చేయాలి అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ముందు విశ్వసించు అంటున్నారు భగవాన్. నీకు లోకం మీద ఉన్న నమ్మకం ఈశ్వరుడి మీద లేదు. ఈ సృష్టి అంతా ఈశ్వరుడి చేతిలో ఉంది, ఆయనను కాదని ఎవరూ ఏమీ చేయటానికి వీలులేదు. ఈ లోకానికి అధిష్టానం ఈశ్వరుడే అది నీవు మర్చిపోతున్నావు. నీకు బయట చూపేగాని లోపల చూపు రావటం లేదు. నీకు లోకం కనిపిస్తోంది కాని దానికి ఆధారంగా ఉన్న పరమేశ్వరుడు నీకు కనిపించటం లేదు. నీ మొఖం అటు తిప్పితేగాని నీకు శాంతి లేదు. ఒక కష్టం తరువాత ఇంకో కష్టం వస్తోంది అని ఇతడు అంటున్నాడు కదా భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే బహుశా ఇన్ని చింతలు,

ఇన్ని కష్టాలు నీకు వస్తేనేగాని నీ మొఖం ఈశ్వరుడివైపుకు తిరగదని ఆయనకు తెలుసు కాబట్టి ఇవన్నీ నీకు పంపిస్తున్నాడేమో, నీ మీద ఇష్టం లేకకాదు అంటున్నారు భగవాన్. ఇదంతా నామంచి కోసమే ఈశ్వరుడు చేస్తున్నాడు అని నువ్వు గ్రహిస్తే ధన్యుడవు. మీరు గుర్తింపులు కోరుకోవద్దు. గుర్తింపులు కోరుకొంటే దేహాభిమానం పెరిగిపోతుంది, స్వరూపానికి దూరమవుతారు. ఏ గుర్తింపు అక్కరలేకుండా పనిచేసేవాడు దేవుడు. అలా పనిచేస్తే నరుడు నారాయణుడు అవుతాడు. మన శరీరాలు వూరికే బొమ్మలు, ఆడించేవాడు ఆయనే. ఆడించేవాడు దేవుడు, ఆడేవాడు కూడా దేవుడే అనుకొంటే మనకు దుఃఖం అణిగిపోతుంది, ఆ బుద్ధి మనకు కలిగితే నిర్వాణసుఖం అందుతుంది.

మన శరీరానికి రోగం వచ్చింది అనుకోండి, రోగ నిర్ధారణ అయ్యింది అనుకోండి ఆ రోగం తగ్గటానికి ఏమందులు వాడాలి, ఆహారనియమం ఎలా ఉండాలి, మన ప్రవర్తన ఎలా ఉండాలి ఇవి అన్నీ మనకు డాక్టరు చెపుతాడు. డాక్టరు చెప్పిన పద్ధతి ప్రకారం చేస్తే వాడు రోగరహితుడు అవుతాడు. ఇప్పుడు మనకు అజ్ఞానం ఉంది అని మనకు తెలుస్తోంది. దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. అజ్ఞానంలో నుండి ఎలా విడుదలపొందాలో భగవంతుడు చెప్పాడు, మనం ఆ విధంగా ప్రాక్టీసు చేస్తే అజ్ఞానరహితులం అవుతాము. రోగ నిర్ధారణ అయ్యాక డాక్టరు చెప్పిన ప్రకారం మందులు వాడకుండా, ఆయన చెప్పినట్లుగా ఆహారనియమం పాటించకుండా ఉంటే ఆ రోగం తగ్గదు. అలాగే అజ్ఞానం ఉంది అని మనకు తెలిసాక, అందులోనుండి ఎలా విడుదలపొందాలో ఆరకంగా మన జీవితవిధానాన్ని తీర్చిదిద్దుకోకపోతే అజ్ఞానంలోనుండి విడుదల పొందలేము. భేదబుద్ధిలో నుండి దుఃఖం వస్తోంది. భేదబుద్ధి ఎప్పుడైతే నశించిందో దుఃఖం అక్కడ ఉండటానికి అవకాశం లేదు.

అసలు సాధన ఎందుకు చేస్తున్నామో మనకు తెలియటం లేదు. సాధన ఎవరు చేస్తారు? మనస్సు చేస్తుంది. ఆ మనస్సు లేకుండా చేసుకోవటానికే సాధన, అది మీకు అర్థమవ్వాలి. మీరు ప్రాణాయామం ద్వారాగాని, భక్తిద్వారాగాని, వివేకంద్వారాగాని, వైరాగ్యంద్వారాగాని ఏదో ఒక ఉపాయం ద్వారా మనస్సును తీసుకొని వెళ్ళి హృదయంలో ఉంచగలిగితే అప్పుడు దానికి వెళ్ళే ఫుడ్ సప్లై ఆగిపోతుంది. అంటే విషయచింతన ఆగిపోయి అది సహజంగానే నశించిపోతుంది. రూపాలు తేడా, నామాలు తేడా, శరీరాలు తేడా, గుణాలు తేడా, రంగులు తేడా వీటి అన్నింటిని తీసి ఒక ప్రక్కనపెట్టండి లోపల ఉన్న వస్తువు ఒక్కటే. మీరు ఒక రూపం దగ్గర ఆగిపోయారు అనుకోండి, నామం దగ్గర ఆగిపోయారు అనుకోండి, అంతకంటే లోపలకు వెళ్ళలేకపోతున్నారు అనుకోండి, అందరిలోను అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు మనకు గోచరంకాడు. నీలోపల ఉన్న అంతర్యామి

నీకు అనుభవంలోనికి రాకపోవటానికి ఎవరో ఇతరులు కారణంకాదు, నువ్వే కారణం అంటే నీ దేహబుద్ధే కారణం, నీ రూపబుద్ధి, నామబుద్ధే కారణం.

కర్తురాజ్ఞయా ప్రాప్యతేఫలం, కర్మకింపరం కర్మ తజ్జడం ఇది మీరు చదువుతున్నారు కాని అర్థమవ్వటం లేదు. ఇది అర్థమైతే మీ దుఃఖం నశిస్తుంది. ఎవడైతే కర్త అనుకొంటున్నారో వాడికి రూపం లేదు, నామం లేదు, వాడు లేడా అంటే ఉన్నాడు. వాడి సంకల్పానికి విరుద్ధంగా లోకంలో ఏదీ జరుగదు ఎందుచేతనంటే వాడు లోకానికి భిన్నంగాలేడు. ఆ కర్త మా కళ్లకు కనబడటం లేదు కదా వాడు ఉన్నాడని ఎలా చెప్పగలము అని కొంతమంది అంటారు. నీ కళ్లకు కనబడాలా, నీ కళ్లకు కనబడితే ఉన్నట్లు, లేకపోతే లేనట్లు. మీరు ఒక కూర చూస్తారు అనుకోండి, ఆ కూర రుచి మీ కళ్లకు తెలియదు, నోటిలో పెట్టుకొంటే దాని రుచి తెలుస్తుంది. అదేవిధంగా మీకు అర్హత కలిగినప్పుడు, యోగ్యత కలిగినప్పుడు ఆ కర్త ఎవడో మీకు తెలుస్తుంది కాని మీ కళ్లకు కనబడటం లేదు అని ఆయన లేడు అనికాదు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నోటితో ఈశ్వరుడు ఉన్నాడు, ఈశ్వరుడు ఉన్నాడు అంటే కాదు నీ నోరు చెప్పే మాటలను లోపల హృదయం అంగీకరించాలి. నీ హృదయంలో ఒకటి ఉంది, నోటితో వేరొకటి చెపుతున్నావు. నీ నోటికి, హృదయానికి సమన్వయం లేదు, ఇంక ఈశ్వర సాక్షాత్కారం ఎలా సాధ్యమౌతుంది. నీ భక్తి నిజమైతే భగవంతుడిని అలా చెయ్యి, ఇలా చెయ్యి అని ఆజ్ఞాపించకు, ఆయనకు ఇష్టం వచ్చినట్లు చెయ్యమని చెప్పు. మీ ఇంట్లో ఏదైనా సంఘటన జరిగింది అనుకోండి, అది మీకు నచ్చలేదు అనుకోండి, భగవంతుడు మంచివాడు కాదని తీర్పులు చెప్పకండి. ఆయన చెప్పినట్లు మీరు వినాలా? మీరు చెప్పినట్లు ఆయన వినాలా? ఇదేనా మీ భక్తి! మీకు రోగం వస్తే డాక్టరు దగ్గరకు వెళ్లి అడుగుతారు అనుకోండి. మీరు ఆపరేషన్ చేయించుకోండి లేకపోతే ఇంతకాలం మందులు వాడండి అని డాక్టరు చెపితే ఆలోచించి మీకు ఎలా బాగుంటే అలా చెయ్యండి అని డాక్టరుతో చెపుతాము. ఆయన మామూలు మనిషే, నీకు డాక్టరు మీద ఉన్న నమ్మకం కూడా భగవంతుడి మీద నీకు లేదు. డాక్టరుతోనే అలా మాట్లాడినప్పుడు అంతా భగవంతుడికే విడిచిపెట్టు. ఎప్పడు ఎక్కడ ఎలా చెయ్యాలో అంతా ఆయనే చూసుకొంటాడు, ఈ బెంగలు, చింతలు, దుఃఖాలు నీకు ఎందుకు? బెంగపెట్టుకోవటానికి తగిన కారణం ఏముంది ఈలోకంలో. ఇదంతా మాయే, ఈ మాయరూపంలో ఉన్నవాడు నారాయణుడే, ఇది అర్థమైతే ఇంక బెంగ దేనికి. దుఃఖకారణం ఉన్నప్పటికీ నువ్వు దుఃఖం లేకుండా ఉండగలిగితే ఆ దుఃఖానికి బాధ్యత ఆయనే వహిస్తాడు, అంతా ఆయనే చూసుకొంటాడు, అదే నిజమైనభక్తి.

మీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని పరమాత్మ చెప్పాడు. మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకోండి. మీకు తెలివితేటలు ఉన్నాయి అనుకోండి, ధనం ఉంది అనుకోండి, చదువు ఉంది అనుకోండి. అన్నీ మీరే వాడేసుకోవద్దు కొంత సమాజానికి ఉపయోగించండి. అది కూడా యజ్ఞంతో సమానం. మీ తెలివిని సమాజానికి ఉపయోగించకుండా అంతా మీరే ఉపయోగించుకొంటూ ఉంటే మీరు దొంగలతో సమానం అని పరమాత్మ చెప్పాడు. కొంతమంది ఏదైనా సలహా అడిగితే చెప్పరు, వారు బాగుపడిపోతారేమో అని వీరి ఉద్దేశ్యం. మీకు తెలివిని ఎవరు ఇచ్చారు? నేను ఇచ్చాను. నాది నాకు ఇవ్వటానికి ఏడుస్తారు ఏమిటి? అంటున్నాడు పరమాత్మ. మీ ఇంట్లో యజమాని మీకు వెయ్యి ఎకరాలు సంపాదించి ఇస్తే వాడికి అన్నం పెట్టటానికి మీరు ఏడిస్తే ఎలాగ! భగవంతుడు మీకు ఇచ్చిన వాటిని మీ దేహయాత్రకు ఉపయోగించు కొంటూ, ఇతరులకు కూడా వాటిని ఉపయోగిస్తే అది యజ్ఞం. అయితే ఇతరులకు చేసేటప్పుడు స్వార్థం లేకుండా ఉపయోగించాలి. మీరు గుడికి వెళ్ళి దేవుడికి అయిదు రూపాయలు ఇస్తే దానం చేసాను అనుకోరు, పూజ చేసాను అనుకొంటారు. నరుడిలో ఉన్న నారాయణుడికి కూడా అలాగ చెయ్యండి. నువ్వు సేవ చేస్తున్నాను, సేవ చేస్తున్నాను అనుకొంటే నీకు తెలియకుండా అహంకారం వచ్చేస్తుంది. ఎవడికైనా ఇబ్బందులలో ఉన్న అబ్బాయికి చదువు చెప్పించారు అనుకోండి, అది సేవ అనుకోవద్దు, అది పూజ. ఎందుచేతనంటే ఆ అబ్బాయి రూపంలో ఉన్నవాడు కూడా నారాయణుడే.

మనం మాట్లాడేటప్పుడు ఏది మాట్లాడాలి, ఎంత వరకు మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి అని జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. ఇతరుల క్షేమం కోరి మాట్లాడాలి, చెప్పేది హితవుగా ఉండాలి, ప్రీతిగా మాట్లాడాలి, ఇతరులకు గాయం తగలకుండా మాట్లాడాలి, చెప్పేమాట వారికి అర్థమవుతూ ఉండాలి, అది కూడా తపస్సుతో సమానం. అందరికీ మనం సహాయ సహకారములు అందించలేము. కాని మనస్సులో మటుకు ఎవరికీ చెడ్డ కోరుకోకూడదు, అందరికీ మంచే జరగాలి అని కోరుకోవాలి. మీకు ఏదైనా బాధ కలిగితే అది ఇతరులకు రాకూడదు అనుకోవాలి. మీ క్షేమాన్ని ఎలా కోరుకొంటున్నారో అలాగ ఇతరుల క్షేమాన్ని కూడా మీరు కోరుకోవాలి. ఇతరులు ఏ మంచి అయితే చెయ్యాలని నీవు కోరుకొంటున్నావో, ఆ మంచినే నీవు ఇతరులకు చెయ్యి. ఇతరులు నీపట్ల ఎలా ప్రవర్తించాలని నువ్వు అనుకొంటున్నావో ఇతరులపట్ల కూడా నీవు అలాగే ప్రవర్తించు, అది తపస్సుతో సమానము. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. శరీరం బతకటానికి సరిపడ తినాలి. మనం

పవిత్రులం అవ్వటానికి శరీరాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. అంతర్యామిని అందుకోవటానికి నీ శరీరాన్ని, మనస్సును, మాటను అతి జాగ్రత్తగా అణకువగా, వినయంగా ఉపయోగించుకో. బ్రహ్మానుభవం పొందటానికి అనుగుణంగా నీ మనస్సు డాన్స్ చేయాలి, నీ శరీరం డాన్స్ చేయాలి, నీ మాట డాన్స్ చేయాలి. అదే యూనివర్సల్ డాన్స్, నటరాజ తాండవం. శివుని డాన్స్ ఎందుకు అంటే లోక కళ్యాణం కోసం. ముగింపులో ఒకమాట. ఇక్కడ రకరకాల మనుషులు కూర్చొని ఉన్నారు. ప్రకృతి రీత్యా ఎవరి గుణాలు వారివి, ఎవరి అంతస్థు వారిది, ఎవరి ప్రవర్తన వారిది. మీరు గతిని పొందాలంటే గతులను చూడకండి అని శాస్త్రంలో ఒకమాట ఉంది. నేను మిమ్మల్ని చూస్తున్నాను అనుకోండి. మీ రంగును నేను చూడకూడదు, మీ కులాన్ని నేను చూడకూడదు, మీ మనస్సు రకరకాలుగా ఉండవచ్చు మీప్రవర్తనను నేను చూడకూడదు, నాకు గతి కావాలంటే ఈ గతులను నేను చూడకూడదు, అందరిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడినే చూస్తూ ఉండాలి. దేహానికి అతీతంగా, మనస్సుకు అతీతంగా హృదయాంతరాళాలలో భగవంతుడు ఉన్నాడు. నీకు గతికావాలంటే రూపాల దగ్గర, నామాల దగ్గర, గుణాల దగ్గర ఆగకు, వాటిని గెంటుకొంటూ గెంటుకొంటూ లోపలకు వెళ్ళి హృదయాంతరాళాలలో ఉన్న భగవంతుడిని చూడు, అప్పుడు నువ్వు గతిని పొందుతావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-06-06, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు ఎప్పుడైనా శాంతిగా ఉన్నా, సుఖంగా ఉన్నా అది స్వతంత్రంగా ఉందాలేక ఇతర వ్యక్తులమీదగాని, పదార్థాలమీదగాని, సంఘటనలమీదగాని ఆధారపడి ఉందా అని చూసుకోవాలి. మనకు అందమైన ఇల్లు ఉండవచ్చు, ఆస్తులు ఉండవచ్చు, వాటి వలన మనకు సంతోషం వస్తుంది, సుఖంగా ఉన్నామని మనకు అనిపిస్తుది కాని ఇవి అన్నీ కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మనకు బాహ్యకారణాల వలన ఏదైనా సుఖం వచ్చినా, సంతోషం వచ్చినా అది నిజం కాదు, అది నిలబడదు, మన మనస్సు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. మనం జపం చేసినప్పుడు మనస్సు నిర్మలంగా ఉంటుంది, అది కూడా పైన ఉన్న పొర, అప్పుడు మనకు కొంత శాంతిగా ఉంటుంది కాని లోపల పొరలలో డిస్ట్రబెన్స్ ఉంటుంది. మన హృదయంలో ఉన్న సత్యవస్తువునుండి వచ్చే సుఖం, శాంతి నార్మల్‌గా ఉంటుంది, సహజంగా ఉంటుంది, స్థిరంగా ఉంటుంది. మిగతావి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. గాఢనిద్రలో మనకు దేహంగొడవ లేదు, లోకం గొడవలేదు, దేవుడు గొడవలేదు కాని మనం ఉన్నాము, అక్కడ సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. మనకు దేహం అంటే చాలా ఇష్టం కాని

గాఢనిద్రలో దేహము నేను అనే తలంపు లేనప్పుడే మనం సుఖంగా, శాంతిగా ఉన్నాము. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది. అది వచ్చాక దేహం వస్తుంది, లోకం వస్తుంది, దేవుడు వస్తున్నాడు. గాఢనిద్రలో నీవు సుఖంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి నీకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది అంటే నేను అనే తలంపు వచ్చాక ఇవి అన్నీ వస్తున్నాయి. ఆ నేను ఎవరో తెలుసుకో అంటున్నారు భగవాన్. మన లోపల ఉన్న చైతన్యం నేను అనదు, దేహము కూడా నేను అనదు, మనస్సే నేను, నేను అంటుంది. ఈ మనస్సు ఎక్కడ నుండి వస్తోంది అంటే హృదయంలో నుండి వస్తోంది. గాఢనిద్రలో ఇది హృదయంలో అణిగిపోతుంది. మనస్సు అణిగిపోయినప్పుడు అది కల్పించిన విషయాలు అన్నీ అణిగిపోతాయి. జాగ్రదవస్థలో హృదయంలో నుండి మనస్సు బ్రెయిన్‌లోనికి వస్తుంది, అప్పుడు దానికి హృదయంలో నుండి లైట్ సప్లయి అవుతూ ఉంటుంది, అప్పుడు మనస్సు ఇంద్రియాల ద్వారా లోకాన్ని చూస్తుంది. ఆశ్చర్యం ఏమిటి అంటే ఈ పని చేయండి స్వర్గానికి వెళతారు, ఆ పూజ చేయండి పుణ్యం వస్తుంది అంటే మీరు ఇష్టపడుతున్నారు, చేస్తున్నారు గాని ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో ఆ నేను ఎవరు అని విచారణ చేయమంటే, ఆ నేనును తెలుసుకోమంటే దాని గురించి ఎవరు ప్రయత్నం చేయటం లేదు. ఆ నేనును విచారణచేస్తే అదిపోతుంది, అదిపోతే నీవు పోవు, నీవు ఎవరో నీకు తెలియబడుతుంది, నీ హృదయంలో ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి వస్తుంది. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియకుండా నీకు శాంతి లేదు, సుఖం లేదు, నీకు ఫ్రీడమ్ లేదు.

మీరు ఏవైనా మంచి వార్తలు వింటారు అనుకోండి మీకు పొంగు వస్తుంది, చెడ్డ వార్తలు వింటారు అనుకోండి డిప్రెషన్ వస్తుంది. లోపల ఉన్న చైతన్యానికి ఎమోషన్ లేదు, డిప్రెషన్ లేదు ఎందుచేతనంటే దానికి ద్వితీయం లేదు. మనస్సుకే ఎమోషన్ వస్తుంది, డిప్రెషన్ వస్తుంది. మనస్సు నిజం అనుకొంటున్నారు కాబట్టి ఇవి అన్నీ వస్తున్నాయి, మనస్సు నిజం కాదు అని మీకు అర్థమైతే ఎమోషన్ లేదు, డిప్రెషన్ లేదు. మనం దేవుడిని బట్టలు లేకపోతే బట్టలు అడుగుతాము, తిండిలేకపోతే రెండు పూటల తిండి పెడితే చాలు అంటాము, ఇల్లు లేకపోతే చిన్న ఇల్లు కట్టుకొనేలాగ చూడు అని అడుగుతాము. మనం దేవుడి దగ్గరకు వెళ్ళినప్పుడు మన ఇంటి దగ్గర సమస్యలు ఉన్నాయి అనుకోండి, మనకు ఆరోగ్యం బాగాలేకపోతే ఆరోగ్యం ప్రసాదించమని, పిల్లలు పరీక్షలు పాసవ్వాలని ఇలా ఏదో ఒకటి అడుగుతూ ఉంటాము. ఇలా మనం దేవుడిని అన్నీ అడుగుతాము కాని మాకు ఆత్మజ్ఞానం ప్రసాదించమని అడగము ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటం లేదు. మనం గుడికి వెళ్ళి

బుద్ధుడు చెప్పిన నిర్వాణసుఖాన్ని ప్రసాదించమని ఎంతమంది అడుగుతున్నారు, అసలు అడగటం లేదు, దాని వైభవం అసలు మనకు తెలియటం లేదు. జ్ఞానం గురించి మనం తెలుసుకొంటూ ఉంటే దాని వైభవం ఇట్టిది అని మనకు తెలుస్తుంది, దాని మీద మనకు ఇష్టం కలుగుతుంది. అందుచేత మనం సబ్జక్టు శ్రవణం చేయాలి. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా పని అంతా ఈశ్వరప్రణాళిక ప్రకారం జరిగిపోతూ ఉంటుంది. పని అయినప్పడు నేను సాధించాను అంటాడు, పని అవ్వనప్పడు దేవుడు అలా చేసాడు అంటాడు, ఇది ఒకరకమైన గోల. నువ్వు బాగుపడ్డానికి ఏదో ఒక రీజన్ ఉంటుంది, అది కనబడదు, వినబడదు. నువ్వు చెడిపోయిన దానికి కూడా రీజన్ ఉంటుంది. అదీ కనబడదు, వినబడదు. మనం జీవితంలో నుండి నేర్చుకొనే పాఠాలు చాలా ఉంటాయి.

నీ హృదయంలో ఉన్న సత్యం తప్పించి అంతా మిధ్య అన్నారు ఆచార్యులవారు. మిధ్య అంటే అసలు లేదు అని కాదు, మిధ్య అంటే ఉన్న దానివలె కనిపిస్తోంది. ప్రపంచం ఉన్న దానివలె కనిపిస్తోంది, మనస్సు ఉన్న దానివలె కనిపిస్తోంది. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఏ ఆకర్షణకు లోనైన నీవు పతనమవుతావు. నీకు ఉన్న వైరాగ్యం నిజమైతే నీవు ఏ ఆకర్షణకు గురికావు, అన్ని ఆకర్షణలలో నుండి రక్షింపబడతావు. నువ్వు లోపలకు వెళ్ళు, లోపలకు వెళ్ళు. నీ హృదయం యొక్క లోతులలో చైతన్యం ఉంది. నీ ప్రాణాన్ని బంధించి, వాక్కును బంధించి, చిత్తాన్ని శుద్ధిచేసుకొని నీ హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళగలిగితే చైతన్యం నీకు దొరుకుతుంది. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా అంత లోతులలోనికి నీవు వెళ్ళలేవు. వైరాగ్యం అంటే మొద్దబ్బాయిలాగ ఉండమని కాదు. వైరాగ్యం ఉన్నవాడికి మనస్సు బాహ్య ముఖానికి వెళ్ళదు, ఇది గుర్తుపెట్టుకోండి. వాడి చేతిలో ఉన్న పని ఏదో వాడు శ్రద్ధగా చేసుకొంటాడు, మనస్సు ఏ ఆకర్షణకు వెళ్ళదు, కీర్తికాంక్ష ఏమీ ఉండదు. మనస్సు బాహ్య ముఖానికి వెళ్ళటానికి దేహవాసన, లోకవాసన కారణం. మీ ఇంటి దగ్గర ప్రశాంతంగా కూర్చొని చూసుకోండి. మీకు ఏదైనా తలంపు వస్తోంది అనుకోండి, ఎందుకు వస్తోంది అంటే దానికి దేహం అన్నా కారణమవుతుంది, లోకం అన్నా కారణం అవుతుంది. ఈ రెండు వాసనలు అసలు లేవు అనుకోండి మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళవలసిన పనిలేదు.

నేను వచ్చాక నువ్వు వస్తావు, వాడు వస్తాడు. నువ్వు అంటే ప్రపంచం, వాడు అంటే దేవుడు. నేను అనే తలంపు లేనప్పడు నువ్వు లేదు, వాడు లేడు. నేను అనే తలంపు ఉంటే అంతా ఉంది, అది అణిగినప్పడు ఏదీ లేదు. నేను అనే తలంపును పరిష్కారం చేసుకోగలిగితే

ఈ ప్రపంచం అంతా నీ హృదయంలో ఐక్యమయిపోతుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా ఎప్పుడైతే నీకు వ్యక్తమయ్యిందో మనస్సు, లోకము, దేవుడు ఈ మూడు ముద్దయిపోతాయి, అంటే ఒక్కటి అంటే ఒక్కటే. సత్యం ఎప్పుడూ ఒక్కటిగానే ఉంటుంది. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, నువ్వు అనుమానం పెట్టుకోవద్దు, సందేహం పెట్టుకోవద్దు అని చెప్పి ఊరుకోలేదు, ఇది నిశ్చయం అని పరమాత్మ చెప్పాడు. ఉన్నది ఉన్నట్లుగా మన గుండెకు స్ఫురించే వరకూ లేనిది ఉన్న దాని వలె కనిపిస్తుంది, అదే మిధ్య. ఇతరులను చూసినప్పుడు, లోకాన్ని చూసినప్పుడు మీకు భయం వేస్తుంది. మీ కంటే భిన్నంగా ఏది చూసినా భయం వేస్తుంది. మిమ్మల్ని మీరు చూసుకోవటం మానివేసి ప్రపంచాన్ని ఎవరు చూడమన్నారు, ఇతరులను ఎవరు చూడమన్నారు. మీరు దానికి అలవాటు పడ్డారు కాబట్టి, అలా చూసుకొంటున్నారు కాబట్టి భయం మిమ్మల్ని వెంటాడుతోంది. మీకు ఇతరులు ఎవరూ గుర్తుకు రావటం లేదు అనుకోండి, ప్రపంచం గుర్తుకు రావటంలేదు అనుకోండి, ఇంక మీకు భయం ఎక్కడ ఉంది. ద్వితీయం ఉన్నప్పుడే భయం. గాఢనిద్రలో మీకు ఎవరికైనా భయం ఉన్నదా, లేదు ఎందుకు అక్కడ ద్వితీయం లేదు. మీకు డిప్రెషన్ రావటానికి కోరిక, కోపం, భయం ఈ మూడే కారణం. మీరు ఎవరికైనా సలహా చెప్తారు అనుకోండి మీరు మీరుగా ఉండి చెప్పండి, వారితో కలిసి పోవద్దు. వారు విన్నా వినకపోయినా అదంతా మనకు అనవసరం, మన డ్యూటీ మనం చెయ్యటమే. మనం ఇతరులకు సలహా చెప్పేటప్పుడు వారు విన్నా, వినకపోయినా మనం అప్‌సెట్ అవ్వకూడదు, అది మనం నేర్చుకోవాలి.

మన దురదృష్టం ఏమిటి అంటే దేవుడిని ఎక్కడో వైకుంఠంలో చూద్దాము, కైలాసంలో చూద్దాము, చనిపోయిన తరువాత చూద్దాము అనుకోవటమేకాని హృదయంలో అనుభవిద్దాము అని ఎవరికీ లేదు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు కాని ఆయనను ఎంజాయ్‌చేయాలనే బుద్ధి మనకు లేదు. హృదయంలో ఉన్న ఈశ్వరుడిని ఆరాధించు, ఆయనను ఎంజాయ్‌చెయ్యి. పూజ చేసినా, జపం చేసినా ఏదో లోకం గొడవ దృష్టిలో పెట్టుకొని అది నెరవేర్చమని అడగటం తప్ప ఆత్మజ్ఞానం సంపాదించటమే గమ్యంగా పెట్టుకొన్న వారు మనలో ఎంతమంది ఉన్నారు. మనకు ఏది అడగాలో తెలియటం లేదు. మనం అడిగినది ఇచ్చేసి వీడి గొడవ వదిలించుకొందాము అని భగవంతుడు అనుకొంటున్నాడు. నీకంటే ఒక హయ్యర్ పవర్ ఉంది, నువ్వు దాని సంకల్పానికి, దాని ఇష్టానికి అనుగుణంగా ఉన్నావు అనుకో ఇంక నీకు దుఃఖం లేదు అంటున్నారు భగవాన్. అసలు నీది అంటూ ఏమీ

లేదు. అంతా భగవంతుడిదే. భగవంతుడిది భగవంతుడికే ఇచ్చి నేను ఇచ్చాను అంటున్నావు, అదే కర్తృత్వం. అది గ్రహించే వరకూ దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. మనం ఎక్కువకాలం బతకాలి అనుకోకూడదు, తొందరగా చనిపోవాలి అనుకోకూడదు, అది ఎంత చెడ్డో ఇది కూడా అంతే చెడ్డ. ఎప్పుడు ఏది జరగాలో అప్పుడు అది జరుగుతూ ఉంటుంది. చావు కూడా ఒక పనే. మనం నడుస్తున్నాము, తింటున్నాము, నిద్రపోతున్నాము, కూర్చొంటున్నాము ఇలా జీవితంలో చాలా పనులు చేస్తున్నాము. జీవితంలో చివరిసారి చేసేపని శరీరానికి సంబంధించిన చావు. చనిపోవటం కూడా ఒకపనే అయితే ఆపని చివరిసారి చేస్తాము.

అహంకారం లేని మనిషి అంటూ ఉండడు. తెలివైనవాడు అహంకారం బయటకు కనబడకుండా చూస్తాడు, తెలివి తక్కువవాళ్ళు వారికి ఎంత అహంకారం ఉంటే అది అంతా బయటకు కనబడుతూ ఉంటుంది. మనిషికి పూర్ణస్థితి వచ్చేవరకు, తన్ను తాను తెలుసుకొనే వరకు ఎంతోకొంత అహంకారం ఉంటుంది. ఏదో ఒక రోజున ఈ శరీరానికి చావు వస్తుంది. మీ కుటుంబ పరిస్థితులతో సంబంధం లేకుండా, లోకంతో సంబంధం లేకుండా, మనస్సులో వచ్చే హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా మరణసమయంలో నూటికినూరుపాళ్ళు ఆనందాన్ని శాంతిని కనుక మీరు ఎంజాయ్‌చేస్తూ ఉంటే మీకు పునర్జన్మ లేదు. మా కుంటుంబ సభ్యులను నేనే ఉద్ధరించాను అని మీరు అనుకొంటున్నారు అనుకోండి మీకు పునర్జన్మ తప్పదు, కొత్తవారిని ఉద్ధరించమని భగవంతుడు మిమ్మల్ని ఇంకో శరీరంలోనికి ట్రాన్స్‌ఫర్ పెట్టేస్తాడు. ఉద్ధరించటానికి అసలు నువ్వు అంటూ ఉన్నావా? భగవంతుని సంకల్పాన్ని కాదని నేను ఎవరినో ఉద్ధరిస్తున్నాను అని మీరు అనుకొంటే అంతకంటే మించిన నటన లేదు. నేను మీకు ఏదో సబ్జక్టు చెప్తున్నాను అనుకోండి. మీకు కొంత అర్థమవుతోంది అనుకోండి. నేను చెప్పటం వలన మీకు అర్థమవ్వటం లేదు, మీరు ఎంతో కొంత డిజర్వు అయ్యారు కాబట్టి అది అర్థమవుతోంది, నేను నిమిత్తమాత్రుడిని మాత్రమే. మీకు అర్హత లేదు అనుకోండి నేను చెప్పిన అర్థంకాదు. మనం చేసే ఘనకార్యాలు ఎలా ఉంటాయి అంటే ఒక ఆకుపడిపోవటానికి సిద్ధంగా ఉంది అనుకోండి సరిగా పక్షి వెళ్ళి అక్కడ వాలింది అనుకోండి, ఆ ఆకు పడిపోతుంది, పక్షి వాలకపోయినా అది పడిపోతుంది. ఆ ఆకు నేనే పడగొట్టేసాను అనుకోవటం ఎటువంటిదో మనం చేసే ఘనకార్యాలు అలాగ ఉన్నాయి. మీ అమ్మాయికి బాగా చదువు వస్తోంది అనుకోండి. అమ్మాయి బాగా చదువుకొంటోంది అనరు, నేను బాగా చదువు చెప్పించాను అంటారు, ఇదేమి పొగరుబోతుతనం. ఆ అమ్మాయికి చదువుకొనే యోగ్యత లేనప్పుడు మీరు చెప్పిస్తే చదువు వస్తుందా? అమ్మాయి కష్టపడి

చదువుకొంటోంది అనే బుద్ధి మనకు లేదు.

మీ శరీరానికి నీడ ఎటువంటిదో, మీ లోపల ఉన్న సత్యానికి జీవుడు కూడా నీడలాంటి వాడు. ఆ జీవుడు నేను అనుకోవటం వలన సమస్తమైన దుఃఖాలు, అశాంతి వచ్చేస్తోంది. ఆ నీడ నీ నీడే అయినా అది నువ్వు కాదు అలాగే నీ లోపల ఉన్న జీవుడు బ్రహ్మానికి నీడలాంటి వాడే కాని వాడు బ్రహ్మం కాదు. ఆ జీవుడితో తాదాత్మ్యం పొందటం వలన దుఃఖం, అశాంతి ప్రారంభమవుతోంది. ఓ భగవంతుడా! ఇంతవరకు నీ ఆస్థి నా ఆస్థి అనుకొన్నాను. నీది నాది అనుకొన్నాను కాబట్టి సమర్పించవలసి వస్తోంది. అంతా నీదే, నాది అంటూ ఏమీ లేదు అని తెలిసాక ఇంక సమర్పించటానికి ఏముంది, ఏమీ లేదు. మనందరము జీరోస్ కాని హీరోస్ అని అనుకొంటున్నాము దీనికి కారణం కర్తృత్వం. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే, ఆయన తప్పించి ఏమీ లేదు. నేను, నాది అంటూ ఏమీ లేదు ఉన్నది ఒక్కటే అని నోటితో చెపితే సరిపోదు, అది గ్రహింపుకు రావాలి, మీ బుద్ధికి అందాలి. మీకు సబ్జక్టు అర్థమయ్యే కొలది నిప్పు మీద నీరుపోస్తే అది ఎలా చల్లారిపోతుందో అలాగ మీ దుఃఖం అంతా నశించి పోతుంది.

మీరు యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా, యాత్రలు చేసినా నేను, నాది లేదు అని గ్రహించటానికే ఈ సాధనలు అన్నీ. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే కాని నీకు నేను, నాది అనే తలంపులు వస్తున్నాయి. అవి నేను కాదు అనే గ్రహింపు నీకు రావాలి, ఈ రెండు తలంపుల నుండి విడుదల పొందటమే సాధన. జీవితంలో వచ్చే సంఘటనలకు మీ తలకాయ పాడుచేసుకోవద్దు. మీకు ధనం ఉన్నా లేకపోయినా, అధికారం ఉన్నా లేకపోయినా, జీవితంలో హెచ్చుతగ్గులు ఉన్నా ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకండి. మీకు తెలివితేటలు ఉంటే మంచిదే, ఆ తెలివిని సద్వినియోగం చేసుకోండి. మీ మనస్సు ఎటుగంతులు వెయ్యమంటే అటు గంతులు వెయ్యకండి. మీ తెలివి ప్రమాణం కాదు, భగవంతుడి మాటను ప్రమాణంగా తీసుకోండి. బంధువులతో, స్నేహితులతో అతిగా ఉండ వద్దు, అతిగా ఉంటే మీ కాలం, శక్తి వృధా అయిపోతుంది, సాధన చేసుకోవటానికి టైము ఉండదు. చుట్టాలను గౌరవించండి, ఎంతవరకు మాట్లాడాలో అంతవరకు మాట్లాడితే సరిపోతుంది, నెత్తిమీద మోసుకొని తిరగవద్దు. మీరు దేని గురించి వర్రీపెట్టుకోవద్దు, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని విశ్వసించండి, ఆయన పాదాలయందు భక్తి కలిగి ఉండండి. ఎవరైనా ఇతరులు బాగుపడాలని మీరు అనుకొంటారు అనుకోండి వారి గురించి వర్రీ పెట్టుకొనే బదులు, వారిని బాగుచెయ్యి, వారికి మంచి బుద్ధిని ప్రసాదించు అని భగవంతుడిని ప్రార్థించండి, మీ కోరిక నెరవేరుతుంది.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-06-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనందరకు గురువు అయిన వ్యాసుడు ఋణం మనం తీర్చుకోలేము. వ్యాసుడు పౌర్ణమి రోజున పుట్టాడు. ఆయన పుట్టిన రోజును గురుపూర్ణిమగా ఎవరి గురువును వారు ఆరాధించుకోమని సాంప్రదాయం మన పెద్దలు ఏర్పాటు చేసారు. మన భారతీయ సాంప్రదాయానికి వాల్మీకి మహర్షి, వ్యాస మహర్షి ప్రాచీనమైనవారు, ఈ ఇద్దరిని మనం మర్చిపోలేము. వేదవ్యాసుడు అని ఎందుకు పిలుస్తారు అంటే ఆయనకు ముందు వేదాలు అన్నీ ఒక గుట్టకింద ఉండేవి, ఆ వేదరాశిని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం అని నాలుగు వేదాలుగా విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. వేదంలో ఒక్క భగవంతుడి గురించే చెప్పారు, ఆత్మజ్ఞానం గురించే చెప్పారు ఇంక ఏమీ చెప్పలేదు అనుకొంటారు. వేదంలో బ్రహ్మజ్ఞానం గురించి చెప్పటమే కాదు, మన జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాల గురించి, సమస్యల గురించి అన్ని విషయాలు వివరంగా చెప్పారు. మన పెళ్ళిలో చదివే మంత్రాలు అయినా, చనిపోయిన తరువాత చేసే కార్యక్రమాలు అన్నీ కూడా వేదంలో నుండి తీసుకొన్నవే, ఎవరి సొంతం కాదు. మనలో మంచితనం ఉంటే ఇతరులలో మంచితనం మనకు తెలుస్తుంది, మనలో మంచితనం లేదు అనుకో ఇతరులలో మంచితనం ఉన్నా అది మనకు కనబడదు. మీరు ఇతరులకు అవసరమైతే సహకరించండి, పీడించవద్దు. పరులను పీడిస్తే మీకు భవిష్యత్‌లో పాపం వస్తుంది, పరులకు సహకరిస్తే పుణ్యం వస్తుంది. పాప ఫలితం దుఃఖం, పుణ్య ఫలితం సుఖం. భారతం వ్రాసి వ్యాసుడు ఒక విషయం చెప్పాడు. ఈ భారతంలో లేని విషయం ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ప్రపంచంలో రకరకాల మనుషులు ఉంటారు. ఇందులో ఏ రకమైన మనిషి అయినాసరే భారతంలో చూస్తే వీడికి సరిపడ మనిషి ఉంటాడు. అయితే భారతం చదివే ఓపిక, అర్థంచేసుకొనే బుద్ధి మనకు లేదు. భారతాన్ని 'పంచమ వేదం' అంటారు.

మీకు చిరాకుగా ఉంది అనుకోండి, అది మీ మొఖంలో కనిపిస్తూ ఉంటుంది. మీ ఇంట్లోవారు మీ మీద కోపంగా ఉన్నారు అనుకోండి, వారు మిమ్మల్ని నోటితో తిట్టకపోయినా వారి కోపం కళ్ళలో కనబడుతూ ఉంటుంది. ఎవరికైనా అసూయ ఉంది అనుకోండి, ఆ అసూయ మాటలు మనకు తెలుస్తూ ఉంటాయి. వారు ఏదిగా ఉంటే అది ఎలాగ కనిపిస్తూ ఉంటుందో అలాగే మనం జ్ఞాని యొక్క మొఖంలోనికి చూస్తూ ఉంటే వాడు పొందిన ఆత్మజ్ఞానం యొక్క వైభవం, హృదయంలో ఉన్న నిర్మలత్వం, ప్రేమ మొత్తానికి తెలియకపోయినా

ఎంతోకొంత మీకు తెలుస్తూ ఉంటుంది అంటాడు వ్యాసుడు. మీరు భగవద్గీత చదవండి, ఉపనిషత్‌లు చదవండి. ఉపనిషత్‌లలో ఇలా చెప్పారు, గీతలో ఇలా చెప్పాడు ఏమిటి అని మీకు సందేహాలు వస్తూ ఉంటే వ్యాసుడు వ్రాసిన బ్రహ్మసూత్రాలు మీ సందేహాల్ని కడిగేస్తాయి. రాగద్వేషాలను ఎంతకాలం అయితే విడిచి పెట్టలేరో అంతకాలం మీకు వైకుంఠంలో చోటు ఇవ్వరు, రాగద్వేషాలను మూలంతో సహా ఎవడైతే విడిచిపెట్టాడో వాడే వైకుంఠానికి వెళ్ళటానికి అర్హుడు అని వ్యాసుడు చెప్పాడు. మనం మాట్లాడేమాట మంచిది అయితే, మంచి మాటలు వింటూ ఉంటే, మన చేత మంచిది అయితే, మన సంకల్పం మంచిది అయితే మనకు మంచిబుద్ధి కలుగుతుంది, సాత్వికబుద్ధి కలుగుతుంది. సాత్వికబుద్ధి మాత్రమే హృదయంలో ఉన్న సత్యానికి దారిచూపిస్తుంది, అక్కడకు చేరుస్తుంది. భగవంతుడు నీకు కేటాయించిన పనిని హృదయపూర్వకంగా శ్రద్ధగా, ప్రేమగా ఈశ్వరార్పితంగా చెయ్యి. అలా పనిచేసుకొంటూ నీ మనస్సును అదుపులో పెట్టుకో, సజ్జనసాంగత్యం చెయ్యి, ఆగ్రహానికి గురి అవ్వకు నిగ్రహాన్ని పెంచుకో. ఇలా జీవించటం మానివేసి లోకం గొడవలు అన్నీ నెత్తిమీద పెట్టుకొని తిరగటం ఎటువంటిది అంటే గెడ్డం గీసుకోవటానికి అద్దం ముందుకూర్చొని బింబానికి గడ్డం గీయటం మానివేసి ప్రతిబింబానికి గెడ్డం గీసేవాడు ఎంత మూర్ఖుడో నువ్వు కూడా అటువంటివాడివే అన్నారు భగవాన్. ఇప్పుడు మన పరిస్థితి అలాగే ఉంది.

ఎవడి బోధ అయితే మీకు లోచూపు కలుగచేస్తుందో, మీ మనస్సును నిర్మలం చేస్తుందో, మీ మనస్సును బ్రహ్మం వైపుకు నెట్టుకొని పోతుందో వాడే సద్గురువు. ఆయన ఆకాశగంగలాంటివాడు. వర్షం కురుస్తూ ఉంటే నీరు పట్టండి అందులో నలకలు ఉండవు, అటువంటివాడు సద్గురువు. ఆత్మ అన్నా, గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. మీ మనస్సును నిగ్రహించుకోండి అని చెప్పటంకాదు, మనస్సు నిగ్రహింపబడే వాతావరణం తీసుకొనివస్తాడు, వాడు గురువు. సద్గురువు సమక్షంలో నీకు ప్రశాంతత కలుగుతుంది, నీకు తెలియకుండా లోపల పురోగమిస్తావు. నిజమైన ఆనందం నీ హృదయంలోనే ఉంది అనే భావనను కలుగజేసి, కలుగచేయటమే కాదు దానిని పొందింపచేస్తాడు. గురువు యొక్క మౌనం జ్ఞానాన్ని ఇవ్వటమే. అందులో నుండి జ్ఞానతరంగాలు, శాంతి తరంగాలు మిమ్మల్ని ముంచేస్తాయి. వాడు ఏ శాంతిని, సుఖాన్ని పొందుతున్నాడో ఆ స్థితిని పొందేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు సద్గురువు. నేను కంచి పరమాచార్యులను చూడటానికి వెళ్ళాను. ఆయన తమిళంలో ఏదో చెపుతున్నారు. నా ప్రక్కన కూర్చొన్న వ్యక్తి ఆయన మొఖంలోనికి చూస్తున్నారు. మీకు తమిళం వచ్చా అన్నాను. నాకు తమిళంరాదు ఆయన ఎవరికో ఏదో చెపుతున్నాడు, ఆ గొడవ నాకు ఎందుకు? నాకు తమిళం వచ్చిఉంటే ఆ

మాటలలో కొట్టుకొనిపోదును, తమిళం రాకపోవటం వలన ఆయన మొఖంలో ఉన్న ప్రసన్నతను, కాంతిని చూస్తున్నాను అన్నాడు. అది సద్గురువు యొక్క వైభవం. గురువు అంటే ఆత్మ, ఆత్మ అంతటా వ్యాపించి ఉంటుంది, దానికి దూరం, దగ్గరతో సంబంధం లేదు. ఇక్కడ ఉండి అమెరికాలో ఉన్న వారిని అనుగ్రహించవచ్చు, ఆత్మ యొక్క వైభవం అట్టిది.

దేహమే నేను అనుకోవటం వలననే మీకు జన్మలు వస్తున్నాయి. దేహము నేను అనే తలంపును తీసి ప్రక్కన పెడితే పూర్వజన్మ లేదు, రాబోయే జన్మలేదు, ఆత్మలో స్థిరపడతావు. తలంపులు, విషయాలు, జన్మలు అన్నీ ఆగిపోతాయి, శాంతిలో ఆనందంలో ఊగిసలాడతావు, ఇంద్రుడికి కూడా మిమ్మల్ని చూసి అసూయ కలుగుతుంది, అది ఆత్మ యొక్క వైభవం. యాత్రలకు వెళ్లి తిరిగి మీకాళ్ళు అరగిపోయినా, ఉపవాసాలు చేసి చేసి మీ శరీరం శుష్కించిపోయినా, దానాలు చేసి చేసి మీ చేతులు అరిగిపోయినా గురువుఅనుగ్రహం లేకపోతే మోక్షం రాదు. మనం గురువు దేహం దగ్గర కూర్చోనక్కరలేదు, ఆయనతో మానసికఅనుబంధం కలిగి ఉంటే మనకు మోక్షం వచ్చేస్తుంది. మీ ఇంట్లో వారు మీకు రకరకాల సుఖాలు ఇవ్వవచ్చు, బంగారాలు, పట్టుచీరలు ఇవ్వవచ్చు, కాని ఆత్మజ్ఞానం వైపుకు మీ కళ్ళు తెరిపించి, ఆత్మ సుఖంలోనికి మిమ్మల్ని మేల్కొలిపేవాడు మీ గురువు, గురువు తప్పించి ఇది ఎవరికి సాధ్యం కాదు. జనాన్ని పోగుచేసుకొనే ఉద్దేశ్యం మాకు లేదు. నేను ప్రోత్సహిస్తే తెల్లవాళ్ళు నా చుట్టూ వందలమంది తిరుగుతారు. జనం కాదు మాకు మోక్షాన్ని ఇచ్చేది. నాకు ఈశ్వరుడి అనుగ్రహం ఉంది అనుకోండి, మీరు ఎవ్వరు ఇక్కడ కూర్చోరనుకోండి, నాకు నష్టం ఏమిటి? పొందవలసింది ఈశ్వరుని దయ, ఆయన దయ కలిగినప్పుడు మోక్షం వస్తుంది.

గురువు యొక్క అనుగ్రహం పొందటానికి ఎంతకాలం పడుతుంది అని అడుగుతున్నారు. అలా ఎదురు చూడవద్దు. గురువు మనకంటే తెలివికలవాడు. ఆయన ఎప్పడు ఇవ్వాలి, మన జీవితాన్ని ఎలా మలుపు తిప్పాలి అని ఆయనే చూసుకొంటాడు. నీవు ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. గురువు పాదాలను నువ్వు అంటిపెట్టుకొని ఉన్నంత కాలం నీ మనస్సు ప్రపంచం వైపుకు తిరగదు, ఆయన పాదాలను విడిచిపెడితే నువ్వు మాయలో పడిపోతావు. సద్గురువు యొక్క సాంగత్యం వలన నీకు తెలియకుండా దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన నశిస్తాయి. రాబోయే జన్మలకు కారణాలు నీలో ఎన్ని ఉన్నప్పటికీ గురువు అనుగ్రహం వాటిని కాల్చి బూడిద చేస్తుంది. ఈశ్వరానుగ్రహం గనీభవించి ఒక ముద్ద అయితే అదే ఈ కొండ, ఈశ్వరానుగ్రహం ఈ కొండరూపంలో ఉంది అంటారు రమణస్వామి. నీ మనస్సు ఎంతకాలం అయితే అంతర్ముఖం అవ్వదో అంతకాలం ఆత్మజ్ఞానం

కలుగదు. బాహ్యదృష్టిలో నుండి నీ మనస్సును మళ్ళించి అంతర్దృష్టిని కలుగచేసేవాడే నిజమైన గురువు. మూలతలంపును దాని మూలంలోనికి తోలుకొని వెళ్ళేవాడే సద్గురువు. రజోతమోగుణాలనుండి నిన్ను తప్పించి సత్వగుణ ప్రదానుడిగా చేసి, ఆ సత్వగుణం ద్వారా నీకు లోచూపు కలుగచేసి నిన్ను హృదయంలోనికి చేర్చేవాడే సద్గురువు. నాకొంపలో నుండి బయటకు తీసుకొని వచ్చి ఈ సృష్టి అంతా ఏ కేంద్రంలో నుండి వస్తోందో ఆ హృదయ కేంద్రంలోనికి నన్ను తీసుకొని పోయావు, హృదయగుహలోనికి చేరాక ఇదేనా నిజమైన ఇల్లు అని తెలిసింది, నా ఇంటికి నేను వచ్చేసాను అనిపించింది, నీ దయ అనే అస్త్రంతో గురితప్పకుండా కొట్టావు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్.

సద్గురువు సన్నిదానంలో మనస్సు నిర్మలం అవుతుంది. గులాబిపువ్వు నేను అందరికి వాసన ఇవ్వాలని అనుకోదు, గులాబి పువ్వు ప్రక్కన కూర్చుంటే మనకు వాసన వస్తుంది. అలాగే సద్గురువు ఉపాధిద్వారా శాంతి, జ్ఞానం, తేజస్సు ప్రవహిస్తూ ఉంటుంది. కొంతమంది ఎలా ఉంటారు అంటే గులాబిపువ్వులో ఉన్న సౌందర్యం చూడటం మానివేసి, గులాబిరేకుల యొక్క అందాన్ని చూడటం మానివేసి, గులాబి పువ్వులో నుండి వచ్చే వాసనను గ్రహించటం మానివేసి, ఆ గులాబిపువ్వు ప్రక్కన ఉన్న ముళ్ళను చూస్తారు, లోకం పోకడ ఇలా ఉంది. ఈశ్వరుడి మీద మనకు ప్రేమ కలుగుతోంది అనుకోండి, అది మన తెలివి తేటల వలన కాదు, మన సాధన వలన కాదు, అది కూడా ఆయన దయే. అది తెలుసుకొన్న వాడు ధన్యుడు. శరీరం అంతా బాడి చేసుకొని జన్మల తరబడి కష్టపడి ప్రయత్నం చేసినా పొందలేని మోక్షాన్ని, గురువు మాట వలన, చూపు వలన, ఆయన దయవలన మోక్షాన్ని నీకు అందిస్తాడు. నీరు శరీరాన్ని ఎలా శుభ్రం చేస్తుందో అలాగ గురువు బోధించి నీ మనస్సును కడిగి శుభ్రం చేసి దానికి లోచూపు నేర్పి, నీకు మోక్షానుభవాన్ని కలుగజేస్తాడు, వాడు గురువు. మీకు ఎప్పుడైనా మంచి రోజులు వస్తాయి, బాగున్నాయి బాగున్నాయి అనుకొంటాము. ఆ మంచి రోజులు నిజం కాదు, బాగున్నాయి అనుకొనేవాడు నిజంకాదు. మీకు ఎప్పుడైనా చెడ్డరోజులు రావచ్చు, కష్టంగా ఉంది అనుకొంటాము, ఆ చెడ్డరోజులు నిజం కాదు, కష్టంగా ఉంది అనుకొనేవాడు నిజం కాదు. ఇది అంతా మహాస్వప్నం అన్నాడు వ్యాసుడు. ఇది మహా స్వప్నం అన్న సంగతి పుస్తకాలు చదవటం వలన తెలియదు. గురువు అనుగ్రహం లేకపోతే ఇది స్వప్నం అన్న సంగతి మీకు తెలియదు. ఆత్మజ్ఞానం యొక్క ఫలమే మోక్షం, అది శాశ్వతమైనది. అది ఎవడు ఇస్తాడు? నీ ఇంట్లోనివారు ఇస్తారా? నీ స్నేహితులు ఇస్తారా? ఆత్మజ్ఞాన దాత గురువు. సద్గురువు మాత్రమే నీకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. కాశీలో మరణిస్తే ముక్తి, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి. మీరు అమెరికాలో ఉన్నా ఇబ్బంది లేదు, మానసికంగా అరుణాచలాన్ని స్మరిస్తే చాలు. జ్ఞానం యొక్క వేగానికి దూరం దగ్గర అని ఏమీలేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 11-07-06 | మంగళ | గురుపౌర్ణమి మహోత్సవం, జిన్నూరు శ్రీరమణక్షేత్రం (మ॥ 2 గం॥) |
| 16-07-06 | ఆది | కాకినాడ ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు అకాడమీ కళ్యాణ మండపం (మ॥ 2 గం॥) |
| 18-07-06 | మంగళ | మాఘం, తూ॥గో॥ జిల్లా (మ॥ 2 గం॥) |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమము (జిన్నూరు)

ఉ॥ గం॥ 6-00ల నుండి మధ్యాహ్నం గం॥ 12-00ల వరకు

**సద్గురు దర్శనం**

ఉ॥ గం॥ 8-00లకు

**శ్రీ రమణ క్షేత్రంలో భగవాన్ పూజ**

మధ్యాహ్నం గం॥ 12-00లకు

**సద్గురు శ్రీ నాన్నగారు శ్రీ రమణ క్షేత్రమునకు విచ్చేయుదురు**

మ॥ గం॥ 2-00లకు

**శ్రీ వేగేశ్న శ్రీరామ వరప్రసాద మూర్తిరాజు (చిలుకూరు)**
**దంపతులచే గురుపూజ**

మ॥ గం॥ 2-30 ని॥లకు

**సద్గురు అనుగ్రహ భాషణములు**

గమనిక :

**ఉ॥ గం॥ 10-00ల నుండి మ॥ గం॥ 12-00ల వరకు ప్రసాద వినియోగము**

# Plea to reduce height of POLAVARAM DAM

## Expert sees 'great threat' to RAJAHMUNDRY

State Government's irrigation engineers and officials took hasty decision regarding the plans of Polavaram project and the dam height should be pegged between 70 ft. and 90 ft. and not 150 ft. as was being planned, to avoid destruction of a vast area in case of dam break.

This was stated by a retired professor of Andhra University College of Engineering and an environmentalist T. Shivaji Rao at a press conference organised by the Gandhi Centre here on Friday.

He wanted the Government to study the project again and make plans to ensure the safety of the project as well as that of upper and lower reaches of the dam and to improve agricultural activity in all three regions of the State.

Basically, the danger that vast areas would face in case of a dam break was not explained at the public hearings held in accordance with the Environment Protection Act, said Prof. Shivaji Rao.

There was a threat of 45 lakh people living in Rajahmundry, Kovvuru, Ramachandrapuram, Mandapeta, Razole, Palakol, Bhimavaram and other towns and hundreds of villages from Kolleru lake to Korangi would face a watery grave and the prosperous area which has huge areas of fertile land and many industries would be destroyed.

- From "The Hindu"